మొదటి పేజీ తరువాయి

# కన్నీటి కరూర్

ఈకబురు,చెన్నై, : తమిళనాట పెను విషాదం చోటు చేసుకుంది. ఒక రాజకీయ సభ... మృత్యు వేదికగా మారింది. తమిళ సినీ నటుడు, తమిళ వెట్రి కళగం (టీవీకే) అధ్యక్షుడు విజయ్ శనివారం కరూర్‌లో నిర్వహించిన రోడ్‌షోలో మరణ మృదంగం మోగింది. లెక్కకు మిక్కిలిగా జనం తరలివచ్చారు. దారులు మొత్తం కిక్కిరిసిపోయాయి. పరిస్థితి అదుపు తప్పి... తొక్కిసలాటకు దారి తీసింది. అధికార వర్గాలు అందించిన సమాచారం ప్రకారం... ఈ విషాదంలో 38 మంది మరణించారు. వంద మందికిపైగా గాయపడ్డారు. మృతుల్లో ఏడుగురు పిల్లలు, 17 మంది వరకు మహిళలు ఉన్నారు. 12మంది పరిస్థితి విషమంగా ఉందని... మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశముందని తెలుస్తోంది. తమిళ నటుడు విజయ్ టీవీకే పేరుతో రాజకీయ పార్టీ ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. వచ్చే ఏడాది జరగనున్న అసెంబ్లీ ఎన్నికల కోసం ఇప్పటి నుంచే ప్రచారం ప్రారంభించారు. గత మూడు వారాలుగా ప్రతి శని, ఆదివారాల్లో 'ర్యాలీ'లు నిర్వహిస్తున్నారు. శనివారం... నామక్కల్, కరూర్‌లో సభలు ఏర్పాటు చేశారు. ఉదయం పది గంటలకు నామక్కల్ రావాల్సిన విజయ్... మూడు గంటలు ఆలస్యంగా అక్కడికి చేరుకున్నారు. సాయంత్రం 3 గంటలకు కరూర్‌లోని వేలుచామిపురం వద్దకు విజయ్ వస్తారని నిర్వాహకులు ప్రకటించారు. కానీ... ఉదయం 11 గంటల నుంచే కరూర్ వీధులు జనంతో కిక్కిరిసిపోయాయి. తమ అభిమాన (కథా)నాయకుడిని చూసేందుకు యువకులతోపాటు... పిల్లలు, మహిళలూ భారీగా తరలి వచ్చారు. ఎండ మండిపోతున్నా లెక్క చేయకుండా గంటలకొద్దీ వేచి చూశారు. చివరికి... నాలుగు గంటలు ఆలస్యంగా రాత్రి 7 గంటల తర్వాత విజయ్ అక్కడికి చేరుకున్నారు. తన సభల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసుకున్న బస్సు పైకి ఎక్కి విజయ్ ప్రసంగం ప్రారంభించగానే... అభిమానులు ఉద్రూతలూగిపోయారు. ఆయన ప్రసంగం ముగియడానికి కొద్దిసేపటి ముందే తొక్కిసలాట మొదలైంది. తీవ్రమైన ఎండ, ఉక్కపోతతో అప్పటికే నీరసించిన జనంలో కొందరు స్పృహతప్పి పడిపోయారు.

ఇది గమనించిన విజయ్ టీమ్ అప్రమత్తమైంది. విజయ్ కూడా తన ప్రసంగాన్ని ఆపివేసి... బస్సు పైనుంచే వాటర్ బాటిళ్లు విసిరేశారు. విజయ్ అక్కడి నుంచి బస్సులో బయలుదేరగానే... పరిస్థితి పూర్తిగా అదుపు తప్పింది. ఉదయం నుంచి ఎండలో ఉండి... మాడిపోయిన జనం ఒక్కసారిగా అక్కడి నుంచి కదిలారు. విజయ్‌ని స్పష్టంగా చూడాలని గోడలు, చెట్లు ఎక్కిన వాళ్లు కిందికి దూకారు. విద్యుత్ సరఫరా ఆగిపోవడంతో చీకట్లు అలుముకున్నాయి. అసలే ఇరుకు రోడ్డు... చీకటి... అటు జన ప్రవాహం, ఇటు ఒకరిమీద ఒకరు పడటంతో తొక్కిసలాట మొదలైంది. పెను విషాదానికి ఇదే కారణమైంది. తొక్కిసలాట సమయంలో పోలీసులూ అసహాయులుగా మారిపోయారు. పరిస్థితిని అదుపులోకి తేవడం వారికి అసాధ్యంగా మారింది. చీకట్లో ఏం జరుగుతోందో ఎవరికీ అర్థం కాలేదు. తొక్కిసలాటలో చిక్కుకున్న జనం ఊపిరాడక ఉక్కిరిబిక్కిరైపోయారు. 'సాయం చేయండి... ప్లీజ్... పోలీస్' అంటూ ఆర్తనాదాలు చేశారు. చాలామంది అక్కడే స్పృహ కోల్పోయారు. దారులన్నీ జనసంద్రంగా మారడంతో అంబులెన్స్‌లు కూడా వేగంగా చేరుకోలేకపోయాయి. క్షతగాత్రులను తరలించేందుకు సమారు 50 అంబులెన్స్‌లను ఉపయోగించారు. క్షతగాత్రులు, మృతదేహాలు, బాధిత కుటుంబీకుల రోదనలతో కరూర్ ప్రభుత్వాసుపత్రి శోకసముద్రంలా మారింది. ఒక్కో అంబులెన్సులో నలుగురైదుగురు క్షతగాత్రులను కూడా తీసుకొచ్చారు. ఇక్కడ 80 మందికి పైగా క్షతగాత్రులు ఈ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. మరికొంతమంది క్షతగాత్రులు ప్రైవేటు ఆసుపత్రుల్లో చేరి చికిత్స పొందుతున్నారు.ఈ విషాదంపై ముఖ్యమంత్రి స్టాలిన్ సచివాలయంలో ఉన్నతస్థాయిలో సమీక్షించారు. మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల పరిహారం ప్రకటించారు. క్షతగాత్రులకు రూ.లక్ష చొప్పున అందిస్తామని ప్రకటించారు. అలాగే... ఈ ఘటనపై హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ అరుణా జగదీశన్ నేతృత్వంలో న్యాయ విచారణకు ఆదేశించారు. ఆదివారం ఉదయం కరూర్ వెళ్లాలని భావించినప్పటికీ... శనివారం రాత్రికే ప్రత్యేక విమానంలో అక్కడికి చేరుకున్నారు. జరిగిన విషాదంపై విచారణకు ఆదేశించారు. ఇక... స్టాలిన్ కుమారుడు, మంత్రి ఉదయనిధి స్టాలిన్ తన దుబాయ్ పర్యటనను రద్దు చేసుకుని, విమానాశ్రయం నుంచి నేరుగా కరూర్ చేరుకున్నారు.కరూర్ నుంచి తిరుచ్చి విమానాశ్రయం చేరుకున్న నటుడు విజయ్.. మీడియాతో మాట్లాడకుండానే వెళ్లిపోయారు. ఆ తర్వాత ఆయన దీనిపై ఒక ప్రకటన విడుదల చేశారు. ''నా గుండె బద్దలైపోయింది. భరించలేని బాధతో విలవిలలాడుతున్నాను. ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నాను'' అని విజయ్ పేర్కొన్నారు.కరూర్ విషాదంపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సంతాపం ప్రకటించారు. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, తమిళనాడు గవర్నర్ రవి, ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తదితర ప్రముఖులు కూడా బాధితులకు తమ ప్రగాఢ సానుభూతి ప్రకటించారు.ఫిబ్రవరిలో ఢిల్లీలోని రైల్వే స్టేషన్‌లో తొక్కిసలాట జరిగి 18 మంది ప్రాణాలు కోల్పోయారు.. జూన్‌లో బెంగళూరులో ఆర్సీబీ జట్టు ఐపీఎల్ విజయోత్సవ కార్యక్రమం నేపథ్యంలో తొక్కిసలాట జరిగి 11 మంది చనిపోయారు.. ఇప్పుడు తమిళనాడులో విజయ్ రాజకీయ సభలో తొక్కిసలాటలో 38 మంది వరకు మృతి చెందారు.. వీటన్నింటికీ కారణం తక్కువ స్థలంలో ఎక్కువ మంది గుమిగూడటం, ఎవరికి వారు తామే ముందుకు దూసుకుపోవడానికి ప్రయత్నించడం.. అన్నింటికన్నా ముఖ్యంగా గుంపును కట్టడి (క్రౌడ్ మేనేజ్‌మెంట్) చేయలేకపోవడమే. మన దేశంలో రైల్వే స్టేషన్లు, బస్టాండులు, మార్కెట్లు, సినిమా హాళ్లు వంటివి ఎప్పుడూ కిక్కిరిసే కనిపిస్తాయి. ఇక జాతరలు, వేడుకల సమయంలో జనం గుమిగూడటమూ సాధారణమే. దానికితోడు సినీ నటుల కార్యక్రమాలు, రాజకీయ సభలు, ర్యాలీలకు భారీగా జనం పోటెత్తుతుంటారు. అలాంటి చోట్ల తొక్కిసలాట జరగకుండా జనాన్ని కట్టడి చేయడమే కీలకం. తగిన భద్రతా ఏర్పాట్లు చేయడం నుంచి ఆధునిక సాంకేతికతను వినియోగించడం దాకా ఇందుకు ఎన్నో మార్గాలు ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. వరల్డ్ రీసోర్సెస్ ఇనిస్టిట్యూట్ ఇండియా నివేదిక ప్రకారం.. ఏ ప్రదేశంలోనైనా ప్రతి చదరపు మీటరుకు నలుగురు వ్యక్తులు ఉంటే అది కిక్కిరిసిన పరిస్థితి. అదే ఆరుగురి చొప్పున ఉంటే ప్రమాదకర పరిస్థితి. తొక్కిసలాటకు అవకాశం ఎక్కువ.ప్రస్తుతం హెచ్‌డీ కెమెరాలు, అవి చిత్రీకరించే దృశ్యాల ఆధారంగా గుమిగూడిన జనం పరిస్థితిని విశ్లేషించే సాంకేతికతలు అందుబాటులోకి వచ్చాయి. ఎక్కడ ఎక్కువ జనం గుమిగూడారు? గుంపులో జనం ఎటువైపు కదులుతున్నారు? తొక్కిసలాట జరిగే పరిస్థితి నెలకొందా? అన్నది ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ.. జనాన్ని నియంత్రించేలా, మరోవైపు మళ్లించేలా క్షేత్రస్థాయిలోని సిబ్బందిని సూచనలు ఇచ్చేందుకు అవకాశం ఉంటుంది. ఇక భారీగా గుమిగూడిన జనం మధ్య అక్కడక్కడా ఖాళీ ప్రదేశం ఉండేలా ఏర్పాట్లు చేయాలని.. ఏదైనా ఇబ్బంది ఏర్పడితే తొక్కిసలాట జరగకుండా ఉపకరిస్తుందని నిపుణులు చెబుతున్నారు. జనం గుమిగూడిన ప్రాంతానికి సినీ నటులు, రాజకీయ నాయకులు, ప్రముఖులు వస్తే.. వారిని చూడటానికి అంతా ఒక్కసారిగా ఎగబడి తొక్కిసలాటకు దారితీస్తుంది. అలాంటి సమయంలో కచ్చితమైన ముందుజాగ్రత్త చర్యలు చేపట్టేలా కఠినమైన నిబంధనలు అమలు చేయాలి. జనం కిక్కిరిసిపోయే పరిస్థితి ఏర్పడితే ముందుగానే జాగ్రత్తపడేలా ప్రజల్లో అవగాహన కల్పించడమూ కీలకం.ప్రేక్షకులకు, ప్రజలకు విజయ్‌గా సుపరిచితుడైన ఆయన పూర్తి పేరు... జోసెఫ్ విజయ్ చంద్రశేఖర్! తమిళనాట 'ఇలయ దళపతి'గా పేరు తెచ్చుకున్నారు. తమిళనాట విజయ్ రాజకీయ రంగ ప్రవేశం పెను సంచలనం సృష్టించింది. గత ఏడాది 'తమిళ వెట్రి కళగం' (తమిళ విజయం పార్టీ) ఏర్పాటు చేశారు. అక్టోబరు 27న విల్లుపురంలో తొలి రాజకీయ సభకు భారీగా జనం తరలి వచ్చారు. ఆ తర్వాత... నిర్వహించిన సభల్లోనూ ఇదే పరిస్థితి. సభలకు వచ్చే జనాన్ని అదుపు చేయడం పోలీసులకు కష్టసాధ్యంగా మారింది. దీంతో విజయ్ ప్రచారానికి పలు నిబంధనలు విధించారు. అయితే దీనిని సవాల్ చేస్తూ ఆయన పార్టీ హైకోర్టును ఆశ్రయించింది. న్యాయస్థానం పోలీసుల నిబంధనల పట్ల అసంతృప్తి వ్యక్తం చేస్తూనే, అన్ని పార్టీల నేతల ప్రచారానికి ఒకే విధమైన నిబంధనలు రూపొందించాలని ఆదేశించింది.



మొదటి పేజీ తరువాయి

## ఉమ్మితో పేజీలు తిప్పడమేంటీ..? హైకోర్టు ఆగ్రహం




**తెలంగాణ భవన్‌లో ఆవిష్కరించిన కేటీఆర్**

**కొడంగల్‌కు చెందిన కాంగ్రెస్, భాజపా నాయకులు భారత రాష్ట్ర సమితిలో చేరిక**

ఈ-కబురు, ఫైళ్ల నిర్వహణకు సంబంధించి సిబ్బంది తీరుపై అలహాబాద్ హైకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. దస్త్రాలపై లాలాజలం మరకలు ఉండటాన్ని తీవ్రంగా పరిగణించింది. ఉమ్మిని ఉపయోగించడం అసహ్యకరమని మండిపడింది. ఇటువంటి అపరిశుభ్ర చేష్టలతో వ్యాధులు సంక్రమించే అవకాశం ఉంటుందని పేర్కొంటూ సిబ్బందిని తీవ్రంగా మందలించింది.

ఓ కేసుకు సంబంధించి ఇటీవల విచారణ చేపట్టిన అలహాబాద్ హైకోర్టులోని లఖ్‌నవూ బెంచ్.. కొన్ని ఫైళ్లపై ఎరుపు రంగు మరకలు ఉండటాన్ని గుర్తించింది. తరచూ ఇటువంటివి కనిపిస్తుండటాన్ని ప్రస్తావించిన న్యాయమూర్తి.. ఉమ్మితో పేజీలను తిప్పడం వల్లే అవి ఏర్పడినట్లు అనుమానించారు. పాన్ మసాలా తిన్న వారి వల్లే ఫైళ్లపై ఎరుపు రంగు మరకలు పడ్డాయనే అభిప్రాయానికి వచ్చారు. ఇటువంటి ఫైళ్లను అనుమతించవద్దని రిజిస్ట్రీని ఆదేశించారు.

**స్కూల్‌కు ప్రవేశ పరీక్ష.. సుప్రీంకోర్టును ఆశ్రయించిన 11ఏళ్ల విద్యార్థి**

"ఇది అత్యంత అపరిశుభ్రమైన వ్యవహారం. ఇటువంటి అసహ్యకరమైన, ఖండించదగినవే కాదు.. పొరస్పృహ లేనిది. ఇలాంటి మురికి పనులను నిలువరించకపోతే వీటిని ముట్టుకునే వారు ఇన్‌ఫెక్షన్ల బారినపడే ప్రమాదం ఉంటుంది" అని న్యాయమూర్తి పేర్కొన్నారు. పిటిషన్లు, దరఖాస్తులు, పుస్తకాలను తీసుకునేటప్పుడు వాటిని పరిశీలించాలని రిజిస్ట్రీని ఆదేశిస్తూ.. లాలాజలం మరకలు ఉన్నవాటిని ఎట్టిపరిస్థితుల్లోనూ అనుమతించకూడదని స్పష్టం చేశారు.

మొదటి పేజీ తరువాయి

## పదేళ్ల పాలకులు.. నమ్మక ద్రోహులు

శనివారం శిల్పారామంలో నిర్వహించిన కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్‌తో కలిసి.. ఇటీవల గ్రూప్1 అధికారులుగా ఎంపికైన 562 మందికి సీఎం నియామక పత్రాలు అందజేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. రెండు పర్యాయాలు అధికారంలో ఉండి సాధించలేని విజయాన్ని తాము సాధిస్తున్నామన్న అక్కసుతో, కడుపులో విషం పెట్టుకుని ఫలితాలను అడ్డుకునే ప్రయత్నం చేశారని ఆరోపించారు. నోటిఫికేషన్ నుంచి ఫలితాల ప్రకటన దాకా.. అడుగడుగునా అడ్డుకునే ప్రయత్నం చేశారని తెలిపారు. ఒక్కో పోస్టుకు రూ.2 కోట్లు, రూ.3 కోట్లు తీసుకుని ఉద్యోగాలిచ్చామంటూ ఆరోపించారని, లక్షల రూపాయలు ఖర్చుచేసి పెద్ద పెద్ద న్యాయవాదులను నియమించుకున్నారని చెప్పారు. నియామకాలు పూర్తయితే తమకు వ్యాపారం ఉండదన్న దురుద్దేశంతో అశోక్‌నగర్‌లోని కొన్ని కోచింగ్ సెంటర్లు ప్రతిపక్షాలకు మద్దతుగా నిలిచాయని విమర్శించారు. అయితే.. ఎవరెన్ని అడ్డంకులు సృష్టించినా.. తనకు గ్రూప్1 అభ్యర్థుల భవిష్యత్తు మాత్రమే కనిపించిందన్నారు.

**ఇట్లుంటది తెలంగాణ..**

"కొంతమంది అప్పుడప్పుడు తెలంగాణ ఎక్కడున్నది? తెలంగాణ ఎట్లుంటది? అని అడుగుతున్నరు. వారందరికీ ఇక్కడి నుంచే చెబుతున్నా. తెలంగాణ ఇక్కడే ఉంది.. ఇట్లుంటది తెలంగాణ. ఇదే తెలంగాణ స్ఫూర్తి, తెలంగాణ చైతన్యం, తెలంగాణ భవిష్యత్తు" అని సీఎం రేవంత్ అన్నారు. తెలంగాణ గడ్డపై ప్రజలను మోసగించినోళ్లు చరిత్రలో కలిసిపోయారని చెప్పారు. అయినా.. కొంత మంది తాము కారణ జన్ములమని, తమ కుటుంబమే తెలంగాణ అని భావించారని పరోక్షంగా కేసీఆర్ కుటుంబాన్ని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. చివరికి వారు తెలంగాణ చరిత్రలో నమ్మకద్రోహులుగా నిలిచిపోయారన్నారు. పదేళ్లుగా గ్రూప్1 పరీక్షలు నిర్వహించకుండా బాధ్యతారహితంగా వ్యవహరించారని, శ్రీకాంతచారి, యాద య్య, ఇషాన్‌రెడ్డి లాంటి వాళ్ల త్యాగాలను అపహాస్యం చేశారని ఆరోపించారు. గత ప్రభుత్వంలో ఆర్ఎంపీ వైద్యులను టీజీపీఎస్సీలో సభ్యులుగా నియమించారని, దానిని రాజకీయ పునరావాస కేంద్రంగా మార్చారని రేవంత్ ధ్వజమెత్తారు. గ్రూప్1 లాంటి రాష్ట్ర ఉన్నత ఉద్యోగులను నియమించే కమిషన్‌లో చిన్నపాటి ఉద్యోగులు ఎలా న్యాయం చేస్తారని ప్రశ్నించారు. అందుకే గ్రూప్1 ప్రశ్నపత్రాలు లీకయ్యాయని, జిరాక్స్ సెంటర్‌లో బయట పడ్డాయని అన్నారు. టీజీపీఎస్సీని యూపీఎస్సీ స్థాయిలో ప్రక్షాళన చేస్తామని తాము ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు చేసి చూపించామన్నారు. డీజీపీగా పనిచేసిన వ్యక్తిని కమిషన్ చైర్మన్‌గా నియమించామని గుర్తు చేశారు. గత 40 ఏళ్లలో సాధించని దానిని.. తాము కేవలం 19 నెలల్లోనే గ్రూప్1 పూర్తిచేసి చూపించామన్నారు.

**4 కోట్ల ప్రజల అభివృద్ధే లక్ష్యం కావాలి..**


"ఇక నుంచి తెలంగాణ యంత్రాంగాన్ని నడిపించే బాధ్యత మీపై ఉంది. మనమంతా కలిసి తెలంగాణ పునర్నిర్మాణంలో భాగస్వామ్యం అవుదాం. దేశానికి కావాల్సింది గుజరాత్ మోడల్ కాదు.. తెలంగాణ మోడల్. మనమేంటో సత్తా చూపించాలి. నిన్నటివరకు మీరు నిరుద్యోగులు. రేపటి నుంచి ఆఫీసర్లు. అధికారులుగా బాధ్యతగా వ్యవహరించాలి. 4 కోట్ల ప్రజల అభివృద్ధే లక్ష్యంగా ఉండాలి" అని గ్రూప్1 విజేతలనుద్దేశించి సీఎం రేవంత్ అన్నారు. ఉద్యోగం సాధించిన వారికి, వారి తల్లిదండ్రులకు అభినందనలు తెలిపారు. తెలంగాణ భవిష్యత్తు నిర్మాణం చేసేందుకు సహకారం అందించాలని కోరారు. "మీ భవిష్యత్తు కోసం శ్రమించిన తల్లిదండ్రులను గుండెల్లో పెట్టుకుని చూసుకునే బాధ్యత మీదే. మీకోసం వారి జీవితాన్ని త్యాగం చేశారు. తల్లిదండ్రుల విషయంలో నిర్లక్ష్యం వహిస్తే మీ జీతాల్లో నుంచి 10శాతం కట్ చేసి.. వారి ఖాతాల్లో వేస్తాం. దీనికి సంబంధించి త్వరలో చట్టం తేబోతున్నాం" అని సీఎం అన్నారు. అనంతరం గ్రూప్1 విజేతలకు నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారంతా సీఎంకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. "మీ పట్టుదలతోనే మా కల సాకారమైంది" అని పలువురు తీవ్ర భావోద్వేగంతో అన్నారు. సమావేశం తర్వాత సీఎం వెలుపలికి వస్తున్నప్పుడు కొందరు తల్లిదండ్రులు సీఎంను కలిసి పాదాభివందనం చేయబోగా.. ఆయన అడ్డుకున్నారు.

**ఐటీఐలలో ఏటీసీ కేంద్రాలు ప్రారంభం**

మహబూబ్‌నగర్/అల్వాల్: ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఉన్న ఐటీఐలతోపాటు హైదరాబాద్ నగరంలోని అల్వాల్ ఐటీఐలో శనివారం అధునాతన సాంకేతిక కేంద్రాలు (ఏటీసీలు) ప్రారంభమయ్యాయి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడి మల్లేపల్లిలోని ఐటీఐ ప్రాంగణం నుంచి వర్చువల్‌గా వీటిని ప్రారంభించారు. జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలో, నాగర్‌కర్నూలు జిల్లా కల్వకుర్తిలో, అమ్రాబాద్ మండలం మన్ననూరులో, వనపర్తిలోని నాగవరం శివారులో ఉన్న ఐటీఐలలో ఈ కేంద్రాలను ప్రారంభించగా.. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరయ్యారు. మరోవైపు అల్వాల్ ఐటీఐ ప్రాంగణంలో టాటా టెక్నాలజీస్ సహకారంతో రూ.6.76 కోట్లతో నిర్మించిన ఏటీసీని ప్రారంభించారు.



## 42శాతం జీవో ఎలా ఇస్తారు?



రిజర్వేషన్లు 50 శాతానికి మించరాదనే పరిమితిని తొలగిస్తూ శాసనసభ ఏకగ్రీవంగా చట్ట సవరణ చేసినప్పటికీ దానికి గవర్నర్ ఆమోదం ఇంకా పొందలేదని ప్రస్తావించింది. సవరణకు గవర్నర్ ఆమోదం లేకుండా కేవలం బిల్లు ఆధారంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల జీవో ఎలా ఇస్తారని హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తే మొత్తం రిజర్వేషన్లు 50 శాతాన్ని మించిపోతాయని, ఇది సుప్రీంకోర్టు తీర్పులతో పాటు పంచాయతీరాజ్ చట్టానికి వ్యతిరేకమని పేర్కొంటూ మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా మూడుచింతలపల్లి మండలం కేశవాపూర్‌కు చెందిన బి.మాధవరెడ్డి, ఎస్.రమేశ్ తదితరులు హైకోర్టు శనివారం రెండు హౌజ్‌మోషన్ పిటిషన్లు దాఖలు చేశారు. ఈ పిటిషన్లపై జస్టిస్ అభినందన్‌కుమార్ షావిలి, జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాదులు మయూర్‌రెడ్డి, జె.ప్రభాకర్ వాదనలు వినిపించారు.

తెలంగాణ పంచాయతీరాజ్ చట్టాన్ని సవరిస్తూ శాసనసభ ఆమోదించిన బిల్లుకు గవర్నర్ ఇంకా ఆమోదం తెలపలేదని, ఎట్టి పరిస్థితుల్లోనూ రిజర్వేషన్లు 50 శాతం మించరాదని కృష్ణమూర్తి వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా, వికాస్ కిషన్‌రావు గవాలీ వర్సెస్ స్టేట్ ఆఫ్ మహారాష్ట్ర కేసుల్లో సుప్రీంకోర్టు చాలా స్పష్టంగా తీర్పులు ఇచ్చిందని గుర్తుచేశారు. పంచాయతీరాజ్ చట్టం, సుప్రీంకోర్టు తీర్పులు అమలులో ఉండగా ప్రభుత్వం జీవో 9 జారీచేయడం చెల్లదని పేర్కొన్నారు. ఎలక్షన్ నోటిఫికేషన్ ఇవ్వకుండా ప్రభుత్వాన్ని అడ్డుకోవాలని కోరారు. తమిళనాడులో 50 శాతం కంటే ఎక్కువ రిజర్వేషన్లు ఇస్తూ దానిని 9వ షెడ్యూల్‌లో చేర్చారని, దానిపై కూడా సుప్రీంకోర్టులో పిటిషన్లు పెండింగ్‌లో ఉన్నాయని ప్రస్తావించారు. రాష్ట్రాలు పంపిన బిల్లులను మూడు నెలల్లో రాష్ట్రపతి, గవర్నర్ ఆమోదించాలని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందని, తమకు గడువు ఎలా విధిస్తారని ప్రశ్నిస్తూ రాష్ట్రపతి సుప్రీంకోర్టుకు రిఫరెన్స్ ఇచ్చారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం పంపిన బిల్లులకు గవర్నర్ మూడు నెలల్లో ఆమోదం తెలిపాల్సిందే అని అనుకున్నా రాష్ట్ర ప్రభుత్వం పంపిన సవరణ బిల్లుకు ఇంకా మూడు నెలలు కాలేదని ప్రస్తావించారు. హైకోర్టుకు సెలవులు ఉన్న రోజు చూసి జీవో ఇచ్చారని ఆరోపించారు.

**అసెంబ్లీకి అధికారముంది**

రాష్ట్ర ప్రభుత్వం తరఫున అడ్వకేట్ జనరల్ ఎ.సుదర్శన్‌రెడ్డి వాదించారు. గవర్నర్ ఆమోదం ముఖ్యం కాదని, శాసన అధికారం అసెంబ్లీకి ఉందా లేదా? అన్నదే ముఖ్యమని చెప్పారు. చట్ట సవరణ చేసే అధికారం రాష్ట్ర అసెంబ్లీకి కచ్చితంగా ఉందని, జీవో జారీ చేయడంలో ఎలాంటి చట్టవ్యతిరేక చర్య లేదని తెలిపారు. శాసనసభకు ఆ అధికారం లేదని పిటిషనర్లు కూడా అనడం లేదని అన్నారు. బీసీల వెనకబాటుతనాన్ని అంచనా వేయడానికి డెడికేటెడ్ కమిషన్ వేసి, లెక్కలు తీసిన తర్వాతే శాస్త్రీయంగా బీసీలకు రిజర్వేషన్లు పెంచామని చెప్పారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్న బిల్లులను శాసనసభలో ఎవరూ వ్యతిరేకించలేదని, ఏకగ్రీవంగా సభ ఆమోదం పొందాయని గుర్తు చేశారు. రిజర్వేషన్లకు సంబంధించిన ఇంత సంక్లిష్టమైన విషయాన్ని హౌజ్‌మోషన్ రూపంలో విచారించడం సబబు కాదని, ప్రభుత్వం నుంచి సూచనలు అందుకునేందుకు కనీస సమయం ఇవ్వాలని కోరారు. ఈ దశలో జోక్యం చేసుకున్న ధర్మాసనం ప్రభుత్వానికి అంత అత్యవసరం ఏముందని.. ఎలక్షన్లు వాయిదా వేసి, చట్టప్రకారం అన్ని అడ్డంకులు తొలగిన తర్వాత నిర్వహించుకోవచ్చని సూచించింది.

దసరా సెలవుల తర్వాత వరకైనా ఎన్నికలు వాయిదా వేసే అంశంపై ప్రభుత్వం నుంచి సూచన తీసుకోవాలని ఏజీని కోరింది. ఏజీ ఫోన్‌లో ప్రభుత్వ వర్గాలను సంప్రదించేందుకు ప్రయత్నించారు. ఎవరూ అందుబాటులో లేరని, దసరా సెలవుల తర్వాతకు విచారణను వాయిదా వేయాలని కోరారు. సంక్లిష్టమైన అంశంలో అత్యవసరంగా విచారణ చేపట్టడం సబబు కాదని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సమ్మతి తెలిపితే ఎన్ని రోజుల్లో నోటిఫికేషన్ ఇచ్చే అవకాశం ఉంది? అని ధర్మాసనం రాష్ట్ర ఎన్నికల కమిషన్(ఎస్ఈసీ) తరఫు సీనియర్ న్యాయవాది విద్యాసాగర్‌ను ప్రశ్నించింది. రాష్ట్ర ప్రభుత్వం సమ్మతి తెలిపిన తర్వాత ఒకటి రెండురోజుల్లో నోటిఫికేషన్ ఇస్తామని ఎస్ఈసీ న్యాయవాది తెలిపారు. అన్ని వర్గాల వాదనలు విన్న ధర్మాసనం వివరణ ఇవ్వాలని పేర్కొంటూ రాష్ట్ర ప్రభుత్వానికి, ఎస్ఈసీకి నోటీసులు జారీచేసింది. తదుపరి విచారణను అక్టోబరు 8వ తేదీకి వాయిదా వేసింది. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు నోటిఫికేషన్ ఇచ్చినా బీసీ రిజర్వేషన్ల పెంపుపై దాఖలైన ఈ పిటిషన్లు సర్వైవ్ అవుతాయని, వీటిపై విచారణ చేపడతామని ధర్మాసనం స్పష్టంచేసింది. నోటిఫికేషన్ కంటే ముందే ఈ పిటిషన్లు దాఖలయ్యాయి కాబట్టి నోటిఫికేషన్‌తో సంబంధం లేకుండా మెరిట్‌పై విచారణ చేపడతామని స్పష్టం చేసింది. దసరా సెలవుల తర్వాత ఈ పిటిషన్లు రెగ్యులర్ రోస్టర్ కలిగిన ద్విసభ్య ధర్మాసనం ఎదుట విచారణకు రానున్నాయి. కాగా ప్రస్తుతానికి ఎలక్షన్ నోటిఫికేషన్ పై గానీ, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు సంబంధించిన జీవో 9పై గానీ హైకోర్టు ఎలాంటి స్టే విధించలేదు.

## పర్యాటకంలో పెట్టుబడులు పెట్టండి



ఈకబురు,హైదరాబాద్:తెలంగాణ రాష్ట్రం పర్యాటకానికి గమ్యస్థానంగా ఉందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. రాష్ట్రంలో, హైదరాబాద్‌లో అనేక పర్యాటక కేంద్రాలు, పురాతన, వారసత్వ కట్టడాలు, ఆలయాలు ఉన్నాయని తెలిపారు. పర్యాటకరంగ పెట్టుబడిదారులు తెలంగాణలో పెట్టుబడులు పెట్టాలని పిలుపునిచ్చారు. ఆ పెట్టుబడులకు తమ ప్రభుత్వం భద్రత కల్పిస్తుందని, లాభాలు తెప్పించే బాధ్యత కూడా తీసుకుంటుందని భరోసా ఇచ్చారు. శనివారం ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర పర్యాటక శాఖ శిల్పారామంలోని సంప్రదాయ వేదికలో నిర్వహించిన 'పర్యాటక సదస్సు'కు సీఎం రేవంత్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. గతంలో రాష్ట్రంలో పర్యాటకరంగ విధానమంటూ లేదని, తాము అధికారంలోకి వచ్చిన తర్వాత పర్యాటక విధానాన్ని తీసుకొచ్చామని తెలిపారు. న్యూయార్క్‌లో స్టాచ్యూ ఆఫ్ లిబర్టీ, కొన్ని దేశాల్లో ఈఫిల్ టవర్, డిస్నీ వరల్డ్ వంటి పర్యాటక కేంద్రాలున్నట్లు.. తెలంగాణ రాష్ట్రంలోని హైదరాబాద్‌లో చార్మినార్, గోల్కొండ కోట, రామోజీ ఫిల్మ్‌సిటీ వంటి పర్యాటక కేంద్రాలున్నాయని అన్నారు. వీటితోపాటు అమ్రాబాద్, కవ్వాల్ టైగర్ రిజర్వ్ ఫారెస్టులు, యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప ఆలయం, వేయి స్తంభాల గుడి, అలంపూర్ శక్తిపీఠం ఉన్నాయన్నారు.

**ప్రపంచంతో పోటీ పడాలనుకుంటున్నాం..**

తెలంగాణలో ఎకో టూరిజం, టెంపుల్ టూరిజంతోపాటు మెడికల్ టూరిజం కూడా అభివృద్ధి చెందుతోందని సీఎం రేవంత్ అన్నారు. ఆసియా దేశాలు, మధ్య ప్రాచ్య దేశాల నుంచి ప్రజలు వైద్యసేవల కోసం హైదరాబాద్‌కు వస్తున్నారని తెలిపారు. న్యూయార్క్, టోక్యో వంటి నగరాలతో పోటీ పడాలన్నదే తమ ఉద్దేశమన్నారు. "గతంలో ఓవైపు ఆపరేషన్ సింధూర్ కొనసాగుతుండగా.. హైదరాబాద్‌లో ప్రపంచ సుందరి పోటీలను నిర్వహించాం. అంటే హైదరాబాద్ ఎంత భద్రంగా ఉంటుందో గమనించాలి. అత్యంత భద్రమైన నగరంగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. శాంతిభద్రతలు, పెట్టుబడుల రక్షణ, పర్యాటకుల భద్రతకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉంది" అని సీఎం భరోసా ఇచ్చారు. రాష్ట్రంలో ప్రభుత్వాలు మారాయే తప్ప.. విధానాలు మారలేదని చెప్పారు. "1994 నుంచి 2004 వరకు చంద్రబాబు ప్రభుత్వం, 2004 నుంచి 2014 వరకు రాజశేఖర్‌రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వం, 2014 నుంచి 2023 వరకు చంద్రశేఖర్‌రావు ప్రభుత్వం, ఇప్పుడు నా ప్రభుత్వం ఉన్నాయి. మేమెప్పుడూ మా పాలసీలను మార్చుకోలేదు" అని అన్నారు. ఈ సందర్భంగా.. రాష్ట్రంలో 30 పర్యాటక ప్రాజెక్టుల ఏర్పాటుకు రూ.15,279 కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు జరిగాయి. దీంతో 19,520 మందికి ప్రత్యక్షంగా, మొత్తం సుమారు 50వేల మందికి ఉపాధి అవకాశాలు లభించే అవకాశముంది. ఇందులో రూ.7,081 కోట్లతో 14 పీపీపీ ప్రాజెక్టులు, రూ.8,198 కోట్ల వ్యయంతో ప్రైవేట్ రంగంలో ప్రాజెక్టులు ఏర్పాటు చేయనున్నారు. ఈ సదస్సులో డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, ఉన్నతాధికారులు, పెట్టుబడిదారులు పాల్గొన్నారు.

## స్థానిక' ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లు అమలు చేస్తాం

**పద్మశాలీల అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం.. కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకల్లో మంత్రులు పొన్నం, తుమ్మల**

ఈకబురు, గన్‌ఫౌండ్రి (హైదరాబాద్): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయడానికి జీవో 9ని విడుదల చేసినట్లు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. శనివారం రవీంద్రభారతిలో రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య సమరయోధుడు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం మంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో పురుడు పోసుకున్న అన్ని ప్రజా ఉద్యమాలకు ప్రత్యక్ష సాక్షి కొండా లక్ష్మణ్ బాపూజీ అని, ఆయన జీవితం.. తెలంగాణ ఉద్యమం పరస్పరం పెనవేసుకున్నాయని కొనియాడారు.

రిజర్వేషన్లను కాపాడుకోవాలని, అందుకోసం బీసీ సంఘాలు ఐక్యంగా ముందుకు నడవాలని పిలుపునిచ్చారు. పద్మశాలీల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, త్వరలోనే పద్మశాలీలతో సమావేశం ఏర్పాటు చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషిచేసిన గొప్ప వ్యక్తి కొండా లక్ష్మణ్ బాపూజీ అని కీర్తించారు.గతంలో ఎన్నడూ లేని విధంగా చేనేత కార్మికులకు రుణమాఫీ చేశామని, బతుకమ్మ చీరల తయారీతో కార్మికులు నిలదొక్కుకునేలా, చేనేత రంగానికి అండగా ఉన్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్, మేయర్ విజయలక్ష్మి, బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్, కార్పొరేషన్ చైర్మన్లు ఈ అనిల్, మెట్టు సాయికుమార్, అఖిల భారత పద్మశాలి సంఘం నేతలు కామర్థపు మురళి, అవ్వారి భాస్కర్, జగన్నాథం, ప్రవళిక, తదితరులు పాల్గొన్నారు.



మొదటి పేజీ తరువాయి

# మూసీ మహోగ్రరూపం..

ఈకబురు, హైదరాబాద్, చంచల్‌గూడ, బేగం బజార్, కేతేపల్లి, న్యూస్‌టుడే: మూసీ నది మహోగ్రరూపం దాల్చింది. 25 ఏళ్లలో ఎన్నడూ లేని విధంగా గరిష్ఠస్థాయిలో ప్రవహించింది. దీంతో హైదరాబాద్‌లోని ఎంజీబీఎస్, చాదర్‌ఘాట్, మూసారంబాగ్ పరిసరాల్లో జనజీవనం అస్తవ్యస్తమైంది. మలక్‌పేట్ నియోజకవర్గం పరిధిలో 10 కాలనీలు, అంబర్‌పేట్‌లో రెండు కాలనీలు నీట మునిగాయి. దాదాపు 2వేల ఇళ్లు వరదలో చిక్కుకున్నాయి. ఎంజీబీఎస్ వద్దనున్న కుడి, ఎడమ వంతెనలతోపాటు నార్సింగిలోని మంచిరేవుల కాజ్‌వే, చాదర్‌ఘాట్ లో లెవల్, మూసారంబాగ్, గౌరెల్లి వద్ద వంతెనలపై నుంచి నీరు ప్రవహించడంతో శనివారం రాకపోకలకు అంతరాయం తలెత్తింది. దీంతో హైదరాబాద్ నగరం ట్రాఫిక్ చక్రబంధంలో చిక్కుకుపోయింది. పలు ప్రాంతాల్లో కిలోమీటర్ల మేర వాహనాలు బారులు తీరాయి. మరోవైపు రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు నారాయణపేట జిల్లాలో పెంకుల షెడ్డు కూలి బాలుడు చనిపోగా.. వనపర్తి జిల్లాలో కొట్టుకుపోతున్న వ్యక్తిని పోలీసులు రక్షించి ప్రాణాలను కాపాడారు.

**మూడు గంటల్లో ముంచెత్తి..**

గండిపేట(ఉస్మాన్‌సాగర్) జలాశయానికి 25 కిలోమీటర్ల ఎగువన శంకరపల్లి వద్ద ఉన్న వంతెనపై ఆరు దశాబ్దాల్లో ఎప్పుడూ పది అడుగులకు మించి వరద రాలేదు. శుక్రవారం రాత్రి ఈ వంతెన వద్ద పదహారున్నర అడుగుల ఎత్తులో వరద నీరు గండిపేటకు చేరుకుంది. 35గంటల వ్యవధిలోనే జలాశయం నిండిపోవడంతో రాత్రి 8 గంటలకు ఉస్మాన్‌సాగర్ అన్ని(15) గేట్లు 9 అడుగుల మేర ఎత్తి 35,600 క్యూసెక్కుల ప్రవాహం దిగువకు విడుదల చేశారు. ఆ వరద నగరానికి చేరే సరికి రాత్రి 11గంటల సమయమైంది. దీంతో అర్ధరాత్రి ఎంజీబీఎస్‌ను చుట్టుముట్టి నీరు లోపలికి ప్రవేశించింది. అధికారులు ముందస్తు హెచ్చరికలు జారీ చేయకపోవడంతో.. ఆస్తి నష్టం ఎక్కువగా జరిగింది. 24 గంటల్లో 2 టీఎంసీల నీరు వదిలినట్లు అంచనా. ఎంజీబీఎస్ ప్లాట్‌ఫాంల వరకు నీరు చేరడంతో లోపల ఉన్న జనం భయంతో బయటకు పరుగు తీశారు. రంగారెడ్డి జిల్లా నందిగామ మండలం అప్పారెడ్డిగూడ వద్ద వాగు పొంగిపొర్లింది. ఓ కారు వాగును దాటేందుకు ప్రయత్నిస్తూ ప్రవాహంలో చిక్కుకుపోగా.. స్థానికులు అందులోని వ్యక్తిని రక్షించారు.మూసీ తన హద్దులను తాకుతూ ఉరకలెత్తడంతో.. లంగర్‌హౌస్ వద్దనున్న బాపూఘాట్ నీట మునిగింది.పురానాపుల్ వద్ద నదిలో ఉన్న శివాలయంలో పూజారి, ముగ్గురు వ్యక్తులు చిక్కుకోగా.. హైడ్రా, పోలీసు సిబ్బంది వారిని రక్షించారు. నాగోల్ వద్ద వరద ప్రవాహం శిల్పారామం అంచును తాకింది. ఉప్పల్ భగాయత్ లేఅవుట్.. చెరువులా మారింది. చాదర్‌ఘాట్ వద్ద వరదలో చిక్కుకుపోయిన రసూల్‌పుర కాలనీకి చెందిన నలుగురు వ్యక్తులు ఇంటిని ఖాళీ చేసేందుకు ససేమిరా అనడంతో.. జీహెచ్ఎంసీ అధికారులు వారికి డ్రోన్ సాయంతో ఆహారం అందించారు. మూసానగర్, రసూల్‌పుర, వినాయకవీధి, శంకర్‌నగర్, పద్మాకాలనీ, తదితర ప్రాంతాల్లోని 1,460 మందికి 10 కేంద్రాల్లో పునరావాసం కల్పించి ఆహారం, తాగునీరు, ఇతర సౌకర్యాలను సమకూర్చినట్లు జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ తెలిపారు. శనివారం సాయంత్రానికి నదిలో వరద ఉద్ధృతి తగ్గడంతో.. రాత్రికి పరిస్థితి కొంత అదుపులోకి వచ్చింది. పై నుంచి వస్తున్న వరదతో నల్గొండ జిల్లా కేతేపల్లి మండలంలోని మూసీ రిజర్వాయర్ నీటిమట్టం భారీగా పెరిగింది. ఎగువ ప్రాంతాల నుంచి రికార్డు స్థాయిలో 41,448 క్యూసెక్కుల ప్రవాహం వచ్చింది. అప్రమత్తమైన అధికారులు శనివారం ఉదయం ప్రాజెక్టు తొమ్మిది క్రస్టుగేట్లు ఎత్తి 44,671 వేల క్యూసెక్కులు దిగువకు విడుదల చేశారు. ప్రాజెక్టు సామర్థ్యం 4.46టీఎంసీలు కాగా 3.96టీఎంసీల నీరు రిజర్వాయర్‌లో ఉంది.

**ఊరెళ్లేందుకు వచ్చి.. ఉసూరుమని!**

దసరా పండక్కి సొంతూళ్లకు వెళ్లేందుకు ఎంజీబీఎస్ చేరిన ప్రయాణికులను వరద ఉసూరుమనిపించింది. ప్రధాన ప్రవేశ మార్గంతోపాటు ప్లాట్‌ఫాంలు, అలైటింగ్ పాయింట్, పరిసర ప్రాంతాలన్నీ నీటిలో చిక్కుకున్నాయి. ఒక్క బస్సు కూడా అక్కడి నుంచి కదల్లేని పరిస్థితి. దీంతో కొన్ని సర్వీసుల్ని తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. ముందుగా రిజర్వేషన్ చేయించుకున్న ప్రయాణికులు కుటుంబసమేతంగా వచ్చి బస్సులు తాత్కాలికంగా రద్దైన విషయం తెలుసుకుని ఇళ్లకు తిరిగెళ్లారు. ఆర్టీసీ ప్రత్యామ్నాయంగా నగర శివారు ప్రాంతాల నుంచి బస్సుల్ని ఏర్పాటు చేసినట్లు వెల్లడించింది. వరద నీటిలో చిక్కుకున్న ఓ వ్యక్తిని వనపర్తి జిల్లా మదనాపురం పోలీసులు కాపాడారు. మహబూబ్‌నగర్ జిల్లా నవాబుపేట మండలంలోని కారుకొండ గ్రామానికి చెందిన రాగుల కురుమయ్య శుక్రవారం రాత్రి కురుమూర్తి స్వామి దేవస్థానానికి వెళ్లేందుకు వనపర్తిరోడ్ రైల్వే స్టేషన్‌లో దిగారు. అప్పటికే లో లెవల్ వంతెనపై వరద పారడంతో వాహనాల రాకపోకలను పూర్తిగా నిలిపివేశారు. ఆయన నడుచుకుంటూ లో లెవల్ వంతెన వద్దకు చేరుకున్నారు. ఎస్సై శేఖర్‌రెడ్డి, ముగ్గురు కానిస్టేబుళ్లు వారిస్తున్నా వారి కళ్లుగప్పి పొలాల వెంట లో లెవల్ వంతెనపైకి చేరుకొని దాటేందుకు ప్రయత్నించే క్రమంలో చిక్కుకున్నారు. అక్కడే ఉన్న రెయిలింగ్‌ను పట్టుకొని గట్టిగా కేకలు వేస్తూ ఫోన్ లైట్ వేసి పోలీసుల వైపు చూపించారు. పోలీసులు వెంటనే జేసీబీని తెప్పించి కురుమయ్యను ఒడ్డుకు చేర్చారు.



మొదటి పేజీ తరువాయి

## 'కాంగ్రెస్ బాకీ కార్డు' ఉద్యమానికి భారత రాష్ట్ర సమితి శ్రీకారం




ఈ-కబురు, హైదరాబాద్, : కాంగ్రెస్ చేసిన మోసాలను రాష్ట్ర ప్రజలకు వివరించేందుకు 'కాంగ్రెస్ బాకీ కార్డు' ఉద్యమానికి భారత రాష్ట్ర సమితి శ్రీకారం చుట్టిందని ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ తెలిపారు. హామీల పేరుతో మోసం చేసిన కాంగ్రెస్‌కు స్థానిక సంస్థల ఎన్నికలు, జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉపఎన్నికలో ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ముఖ్యనాయకులు హరీశ్‌రావు, వద్దిరాజు రవిచంద్ర, జగదీశ్‌రెడ్డి, పద్మారావు, మహమూద్ అలీ, మధుసూదనాచారి, ప్రశాంత్‌రెడ్డి, సబితారెడ్డి, తలసాని శ్రీనివాస్‌యాదవ్, వి.శ్రీనివాస్‌గౌడ్, స్వామిగౌడ్, పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మారెడ్డి తదితరులతో కలిసి ఆయన శనివారం తెలంగాణ భవన్‌లో 'కాంగ్రెస్ బాకీ కార్డు' పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కొడంగల్ నియోజకవర్గం కాంగ్రెస్, భాజపాలకు చెందిన పలువురు మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు కేటీఆర్ సమక్షంలో భారత రాష్ట్ర సమితిలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. 'హామీలిచ్చి, అధికారంలోకి వచ్చిన తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని గాలికొదిలేసింది. రాష్ట్రంలో ఏ వర్గానికి ఎంతెంత బాకీ పడిందో లెక్కలతో సహా ప్రజల ముందుంచేందుకు 'కాంగ్రెస్ బాకీ కార్డు' ఉద్యమాన్ని భారత రాష్ట్ర సమితి మొదలుపెట్టింది. మోసపోతే గోస పడతామని ఎన్నికల ముందు కేసీఆర్ పదేపదే చెప్పారు. అదే ఇవాళ నిజమైంది. మొదటి క్యాబినెట్ సమావేశంలోనే కాంగ్రెస్ ఇచ్చిన హామీలకు చట్టబద్ధత కల్పిస్తామని రాహుల్‌గాంధీ అన్నారు. ఇప్పటి వరకు 30కి పైగా క్యాబినెట్ సమావేశాలు జరిగినా ఆ ఊసే లేదు. రాష్ట్రానికి సీఎం రేవంత్‌రెడ్డే కావచ్చు కానీ, కొడంగల్‌కు మాత్రం తిరుపతిరెడ్డే సీఎం. కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పడానికి మూడేళ్లు ఎదురుచూడాల్సిన అవసరం లేదు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో భారత రాష్ట్ర సమితిని బంపర్ మెజారిటీతో గెలిపిస్తే చాలు. వాతావరణ శాఖ హెచ్చరికలు రాగానే హిమాయత్‌సాగర్, ఉస్మాన్‌సాగర్‌లోని నీళ్లను తొలగించి.. మూసీ వరదను అందులో ఆపితే హైదరాబాద్‌కు వరద తగ్గుతుంది. కానీ, మూసీ ప్రాజెక్టును ఎలాగైనా చేయాలన్న దురుద్దేశంతో ఆ రెండు చెరువులను ఖాళీ చేయకుండా కావాలనే ఇవాళ హైదరాబాద్‌ను వరద ముంచెత్తేలా చేశారు' అని కేటీఆర్ ఆరోపించారు.

మొదటి పేజీ తరువాయి

## భారీగా ఐపీఎస్‌ల బదిలీలు








ఈ-కబురు, హైదరాబాద్: తెలంగాణలో సీనియర్ పోలీస్ ఉన్నతాధికారులు సహా పలువురు ఐపీఎస్ అధికారులకు స్థానచలనం కలిగింది. శుక్రవారం నూతన డీజీపీగా బత్తుల శివధర్‌రెడ్డిని నియమించిన అనంతరం అర్ధరాత్రి వరకు ఈ బదిలీలపై కసరత్తు జరిగింది. ఈ క్రమంలో భారీగా బదిలీలు చేస్తూప్రభుత్వం శనివారం ఉత్తర్వులిచ్చింది. శాంతిభద్రతలపరంగా కీలకమైన హైదరాబాద్ నగర కొత్వాల్‌గా ఉన్న సీవీ ఆనంద్‌ను హోంశాఖ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా నియమించింది. ఆ స్థానంలో వి.సి.సజ్జనార్‌కు బాధ్యతలు అప్పగించింది. ఈ స్థానాన్ని పలువురు ఐపీఎస్‌లు ఆశించినా ప్రభుత్వం సజ్జనార్ వైపే మొగ్గుచూపింది. మరో కీలకమైన ఇంటెలిజెన్స్ చీఫ్ పోస్ట్‌కు 1997 బ్యాచ్ అధికారి విజయ్‌కుమార్‌ను ఎంపిక చేసింది. ఇప్పటివరకు అవినీతి నిరోధక శాఖ(ఏసీబీ) డీజీగా పనిచేసిన ఆయన వివిధ కీలక కేసుల్ని పర్యవేక్షించారు. ఇప్పటివరకు హోంశాఖ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా పని చేసిన రవిగుప్తాకు సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్(సీజీజీ) ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్మన్‌గా బాధ్యతలు అప్పగించింది. ఈ ఏడాది డిసెంబరులో పదవీ విరమణ పొందనున్న ఆయనను డైరెక్టర్ జనరల్ హోదాలో అక్కడ నియమించింది. 1994 బ్యాచ్‌కు చెందిన శిఖాగోయెల్‌కు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ జనరల్‌గా బాధ్యతలు అప్పగించింది. ప్రస్తుతం తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో(టీజీసీఎస్‌బీ) డైరెక్టర్‌గా పని చేస్తున్న ఆమె ఈ పోస్టులోనూ పూర్తి అదనపు బాధ్యతల్లో కొనసాగనున్నారు. హోంగార్డుల విభాగం అదనపు డీజీపీగా ఉన్న 1995 బ్యాచ్ ఐపీఎస్ స్వాతిలక్రాకు స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్(ఎస్పీఎఫ్) డీజీగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించింది. తెలంగాణ శాంతిభద్రతల విభాగం అదనపు డీజీపీ మహేశ్ మురళీధర్ భగవత్‌కు అదనపు డీజీపీ(పర్సనల్)గా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించింది. ప్రస్తుతం సీఐడీ చీఫ్‌గా ఉన్న చారుసిన్హాను అవినీతి నిరోధకశాఖ(ఏసీబీ) డైరెక్టర్ జనరల్‌గా పూర్తి అదనపు బాధ్యతల్లో నియమించింది.

1. రవి గుప్తా (Ravi Gupta)
ఐపీఎస్ బ్యాచ్: 1990
ప్రస్తుతం: హోం శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి
బదిలీ: సెంటర్ ఫర్ గుడ్‌గవర్నెన్స్ డీజీ

2. సీవీ ఆనంద్ (CV Anand)
ఐపీఎస్ బ్యాచ్: 1991
ప్రస్తుతం: హైదరాబాద్ పోలీసు కమిషనర్
బదిలీ: హోం శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి

3. శిఖా గోయల్ (Shikha Goel)
ఐపీఎస్ బ్యాచ్: 1994
ప్రస్తుతం: సైబర్ సెక్యురిటీ డైరెక్టర్
బదిలీ: విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీజీ

4. స్వాతి లక్రా (Swati Lakra)
ఐపీఎస్ బ్యాచ్: 1995
ప్రస్తుతం: హోంగ్రౌండ్ ఏడీజీపీ
బదిలీ: స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ డీజీ (ఫుల్ అడిషనల్ చార్జ్)

5. మహేష్ మురళీధర్ భగవత్ (Mahesh Muralidhar Bhagwat)
ఐపీఎస్ బ్యాచ్: 1995
ప్రస్తుతం: లా అండ్ ఆర్డర్ ఏడీజీపీ
బదిలీ: ఏడీజీపీ (పర్సనల్- అడిషనల్ చార్జ్)

6. చారు సిన్హా (Charu Sinha)
ఐపీఎస్ బ్యాచ్: 1996
ప్రస్తుతం: సీఐడీ అడిషనల్ డీజీపీ
బదిలీ: ఏసీబీ డైరెక్టర్ జనరల్

7. డాక్టర్ అనిల్ కుమార్ (Dr. Anil Kumar)
ఐపీఎస్ బ్యాచ్: 1996
పోస్టింగ్: గ్రేహౌండ్స్, అక్టోపస్ ఏడీజీపీ (ఆపరేషన్స్)

8. వీసీ సజ్జనార్ (VC.Sajjanar)
ఐపీఎస్ బ్యాచ్: 1996
ప్రస్తుతం: ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్
బదిలీ: హైదరాబాద్ పోలీసు కమిషనర్

9. విజయ్ కుమార్ (Vijay Kumar)
ఐపీఎస్ బ్యాచ్: 1997
పోస్టింగ్: ఇంటెలిజెన్స్ ఏడీజీపీ

10. వై నాగిరెడ్డి (Y Nagi Reddy)
ఐపీఎస్ బ్యాచ్: 1997
ప్రస్తుతం: డిజాస్టర్ రెస్పాన్స్, ఫైర్ సర్వీసెస్ డీజీ
బదిలీ: ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్

11. దేవేంద్ర సింగ్ చౌహాన్ (Devendra Singh Chauhan)
ఐపీఎస్ బ్యాచ్: 1997
ప్రస్తుతం: సివిల్ సప్లైస్ వీసీ, ఎండీ
బదిలీ: మల్టీజోన్-II ఏడీజీపీ

12. విక్రం సింగ్ మాన్ (Vikram Singh Mann)
ఐపీఎస్ బ్యాచ్: 1998
ప్రస్తుతం: లా అండ్ ఆర్డర్ అడిషనల్ కమిషనర్
బదిలీ: డిజాస్టర్ రెస్పాన్స్, ఫైర్ సర్వీసెస్ డీజీ

13. ఎం స్టీఫెన్ రవీంద్ర (Stephen Raveendra)
ఐపీఎస్ బ్యాచ్: 1999
పోస్టింగ్: సివిల్ సప్లైస్ కమిషనర్

14. ఎం శ్రీనివాసులు (M. Srinivasulu)
ఐపీఎస్ బ్యాచ్: 2006
ప్రస్తుతం: సీఐడీ ఐజీపీ
బదిలీ: అడిషనల్ కమిషనర్ (క్రైమ్స్), హైదరాబాద్

15. తఫ్సీర్ ఇక్బాల్ (Tafseer Iqubal)
ఐపీఎస్ బ్యాచ్: 2008
ప్రస్తుతం: జోన్ VI డీఐజీ
బదిలీ: లా అండ్ ఆర్డర్ జాయింట్ కమిషనర్

16. ఎస్‌ఎం విజయ్ కుమార్ (SM Vijay Kumar)
ఐపీఎస్ బ్యాచ్: 2012
ప్రస్తుతం: హైదరాబాద్ వెస్ట్‌జోన్ డీసీపీ
బదిలీ: సిద్ధిపేట పోలీసు కమిషనర్

17. సింధు శర్మ (Sindhu Sharma)
ఐపీఎస్ బ్యాచ్: 2014
ప్రస్తుతం: ఇంటెలిజెన్స్ ఎస్పీ
బదిలీ: ఏసీబీ జాయింట్ డైరెక్టర్

18. డాక్టర్ జి వినీత్ (Dr. G. Vineeth)
ఐపీఎస్ బ్యాచ్: 2017
ప్రస్తుతం: మాదాపూర్ డీసీపీ
బదిలీ: నారాయణ్‌పేట్ ఎస్పీ

19. డాక్టర్ బి అనురాధ (Dr. B. Anuradha)
ఐపీఎస్ బ్యాచ్: 2017
పోస్టింగ్: ఎల్బీ నగర్ డీసీపీ, రాచకొండ

20. సీహెచ్ ప్రవీణ్ కుమార్ (Ch. Praveen Kumar)
ఐపీఎస్ బ్యాచ్: 2017
పోస్టింగ్: ఏసీబీ జాయింట్ డైరెక్టర్

21. యోగేష్ గౌతమ్ (Yogesh Gautam)
ఐపీఎస్ బ్యాచ్: 2017
ప్రస్తుతం: నారాయణ్‌పేట్ ఎస్పీ
బదిలీ: రాజేంద్రనగర్ డీసీపీ, సైబరాబాద్

22. సీహెచ్ శ్రీనివాస్ (Ch. Srinivas)
ఐపీఎస్ బ్యాచ్: 2018
పోస్టింగ్: హైదరాబాద్ వెస్ట్‌జోన్ డీసీపీ

23. రితిరాజ్ (Riti Raj)
ఐపీఎస్ బ్యాచ్: 2018
పోస్టింగ్: మాదాపూర్ డీసీపీ, సైబరాబాద్

మొదటి పేజీ తరువాయి

## ఫిరాయింపు ఎమ్మెల్యేలపై రేపటి నుంచి విచారణ



ఈ-కబురు,హైదరాబాద్: బీఆర్ఎస్ టికెట్‌పై గెలిచి కాంగ్రెస్ పార్టీలో చేరిన ఎమ్మెల్యేలపై విచారణకు ముహూర్తం కుదిరింది. విచారణ తేదీలను స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఖరారు చేశారు. ఈ మేరకు శనివారం శాసనసభ కార్యదర్శి షెడ్యూల్‌ను విడుదల చేశారు. సెప్టెంబరు 29, అక్టోబరు 1 తేదీల్లో నలుగురు ఎమ్మెల్యేలను విచారిస్తారు. రెండు రోజుల సమయం కాలెయాదయ్య, గూడెం మహిపాల్ రెడ్డి, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, ప్రకాశ్‌గౌడ్‌లకు కేటాయించారు. మిగతా నలుగురిని దసరా పండుగ తర్వాత అక్టోబరు ఐదో తేదీలోపు విచారించే అవకాశం ఉందని స్పీకర్ కార్యాలయ వర్గాలు తెలిపాయి. ఉదయం 11 నుంచి సాయంత్రం 4 వరకు ఇరు వర్గాల వాదనలు స్పీకర్ వింటారు. ఒక్కో ఎమ్మెల్యేకు గంట సమయం కేటాయించారు. పిటిషనర్లుగా కోరుట్ల బీఆర్ఎస్ ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్, సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, జనగాం ఎమ్మెల్యే పల్లా రాజేశ్వరరెడ్డిలు ఉండగా, ప్రతివాదులుగా ఆ నలుగురు ఎమ్మెల్యేలున్నారు. మొత్తం పది మంది ఎమ్మెల్యేలకు నోటీసులు ఇవ్వగా, 8 మంది వివరణ ఇచ్చారు. వారిలో నలుగురిని సోమ, బుధవారాల్లో విచారించనున్నారు. దసరా తర్వాత మూడు, నాలుగు తేదీల్లో మిగిలిన నలుగురిని విచారిస్తారు. బార్బొడోస్‌లో జరుగుతున్న కామన్‌వెల్త్ పార్లమెంటరీ అసోసియేషన్ సదస్సులో పాల్గొనేందుకు అక్టోబరు ఆరున స్పీకర్ ప్రసాద్ కుమార్ బయల్దేరి వెళ్లనున్నారు. అకోబరు23 వరకూ విదేశాల్లోనే ఉంటారు. ఈ నేపథ్యంలో అక్టోబరు ఐదులోపు అనర్హత పిటిషన్‌కు వివరణ ఇచ్చిన 8 మంది ఎమ్మెల్యేల విచారణ పూర్తి చేయాలని స్పీకర్ భావిస్తున్నారు. విచారణలో వాదనలు వినిపించేందుకు న్యాయవాదులను నియమించుకోవాలని ఇరువర్గాలను స్పీకర్ కార్యాలయం కోరింది. న్యాయవాదులను నియమించుకున్నట్లుగా టీఆర్ఎస్ఎల్పీ ప్రతినిధి శుక్రవారం స్పీకర్ కార్యాలయానికి లేఖ కూడా ఇచ్చినట్లు సమాచారం. సోమవారం విచారణ ప్రారంభం కానుంది. బీఆర్ఎస్ టిక్కెట్టుపై గెలిచి కాంగ్రెస్ పార్టీలో చేరిన దానం నాగేందర్, కడియం శ్రీహరి, తెల్లం వెంకట్రావు, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, కాలె యాదయ్య, అరికెపూడి గాంధీ, ప్రకాష్‌గౌడ్, కృష్ణమోహన్‌రెడ్డి, సంజయ్ కుమార్, గూడెం మహిపాల్‌రెడ్డిలపై అనర్హత వేటు వేయాలంటూ స్పీకర్‌కు బీఆర్ఎస్ పార్టీ పిటిషన్ ఇచ్చింది. స్పీకర్ నిర్ణయం తీసుకోవడం లేదంటూ సుప్రీంకోర్టునూ ఆశ్రయించింది. సుప్రీంకోర్టు సూచన మేరకు విచారణ ప్రక్రియను ప్రారంభించిన స్పీకర్ పది మంది ఎమ్మెల్యేలకు నోటీసులు జారీ చేశారు. దానం నాగేందర్, కడియం శ్రీహరి మినహా మిగిలిన 8 మందీ తాము పార్టీ మారలేదంటూ అఫిడవిట్ల పూర్వకంగా వివరణ ఇచ్చారు. ఫిర్యాదుదారులు కూడా వారికి వ్యతిరేకంగా ఆధారాలు సమర్పించారు. ఈ నాలుగు రోజులు కేవలం విచారణ నడుస్తుదని, నిర్ణయం తీసుకునేందుకు స్పీకర్ మరికొంత సమయం తీసుకునే అవకాశం ఉందని సమాచారం.

## ప్రపంచ ఉగ్రవాద కేంద్రం పాకిస్థాన్



ఈకబురు, న్యూయార్క్ : ఉగ్రవాదాన్ని అధికార విధానంగా కలిగిన పొరుగుదేశం(పాకిస్థాన్) ప్రపంచ ఉగ్రవాద కేంద్రంగా నిలిచిందని విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ చెప్పారు. ఉగ్రవాదాన్ని ఏమాత్రం ఉపేక్షించరాదని, ఉగ్రవాదులకు ఆర్థిక సాయం అందకుండా చూడాలని ఆయన ఐక్యరాజ్యసమితి సర్వప్రతినిధి సభలో ప్రసంగిస్తూ చెప్పారు. ఉగ్రవాద మూలాలను ఉమ్మడిగా పెకిలించి వేయాలని ఆయన ప్రపంచ దేశాలకు పిలుపునిచ్చారు. పహల్గాంలో ఉగ్రవాదులు పాశవిక దాడి జరిపారని, ప్రతిగా భారత్ పాక్‌లోని ఉగ్రవాద శిబిరాలను ధ్వంసం చేసిందని చెప్పారు. గాజాలో శాంతి నెలకొనాలని, దీని కోసం భారత్ సహకరిస్తుందన్నారు. ఇదిలా ఉండగా, ఆపరేషన్ సిందూర్ వేళ కాల్పుల విమరణ విషయంలో మూడో దేశం ప్రమేయం లేదని.. మూడో వ్యక్తి ప్రమేయం అంతకన్నా లేదని భారత్ ఐరాస వేదికగా స్పష్టం చేసింది. ఈ మేరకు ఐరాసలో భారత శాశ్వత మిషన్ తొలి కార్యదర్శి పటేల్ గహ్లోత్ కీలక ప్రకటన చేశారు. "మే 9వ తేదీ వరకు భారత్‌పై కాల్పులకు పాల్పడుతూ.. పాక్ బెదిరింపు ధోరణిని ప్రదర్శించింది. కానీ, మే 10న భారత్‌తో పాక్ సైన్యం కాళ్లబేరానికి వచ్చింది. అయితే.. పాక్ ప్రధాని..తమ దేశంలో ధ్వంసమైన రన్‌వేలు తమ విజయమని భావిస్తే.. వారు ఆనందించవచ్చు" అని ఎద్దేవా చేశారు.

## 75 ఏళ్లు నిండటంతోనే కీలక బాధ్యతల నుంచి తప్పుకొన్నా



ఈ-కబురు, దిల్లీ: వయసు 75 ఏళ్లు నిండటంతోనే జాతీయ కార్యదర్శి పదవి నుంచి తప్పుకొన్నట్లు సీపీఐ కంట్రోల్ కమిషన్ ఛైర్మన్‌గా నియమితులైన కె.నారాయణ తెలిపారు. ఆయన శనివారం దిల్లీలోని పార్టీ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. '75 ఏళ్లు నిండిన వారు కీలక పదవుల నుంచి రిలీవ్ కావాలని చండీగఢ్‌లో జరిగిన పార్టీ జాతీయ మహాసభల్లో నిర్ణయం తీసుకున్నారు. పార్టీ ప్రధాన కార్యదర్శి పదవికి మాత్రం సడలింపునిచ్చారు. దాన్ని అనుసరించి ఆ పదవిలో డి.రాజా కొనసాగుతారు' అని వివరించారు. పార్టీలో అంతర్గత సమస్యలు ఉత్పన్నమైనప్పుడు వాటిని సక్రమంగా పరిష్కరించేందుకు కంట్రోల్ కమిషన్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు

# మరణించిన వారి బ్యాంకు ఖాతాల సెటిల్‌మెంట్ 15 రోజుల్లోనే




ముంబయి: చనిపోయిన వారి బ్యాంకు ఖాతాలు, లాకర్లకు సంబంధించిన క్లెయిమ్ సెటిల్‌మెంట్ నిబంధనలను రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) శుక్రవారం సవరించింది. 15 రోజుల గడువులోగా సెటిల్‌మెంట్ ప్రక్రియ పూర్తవ్వాలని, ఒక వేళ ఆలస్యమైతే నిర్దిష్ట పరిహారాన్ని నామినీలకు ఇవ్వాల్సి ఉంటుందని ఆర్‌బీఐ స్పష్టం చేసింది. ఆ మేరకు 'రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (సెటిల్‌మెంట్ ఆఫ్ క్లెయిమ్స్ ఇన్ రెస్పెక్ట్ ఆఫ్ డిసీజ్డ్ కస్టమర్స్ ఆఫ్ బ్యాంక్స్) డైరెక్షన్స్ 2025' కింద సవరించిన నిబంధనలను జారీ చేసింది. వీటిని సాధ్యమైనంత త్వరగా అమలు చేయాలని.. 2026 మార్చి 31 కంటే ఆలస్యం కారాదని తెలిపింది.

నామినేషన్ లేదా సర్వైవర్‌షిప్ క్లాజ్‌తో ప్రారంభించిన డిపాజిట్ ఖాతాలకు సంబంధించి, డిపాజిటర్లు మరణించినపుడు నామినీ/సర్వైవర్‌కు వాటిని బదిలీ చేయడం బ్యాంకుల బాధ్యత అని ఆర్‌బీఐ తెలిపింది.

నామినీ/సర్వైవర్‌షిప్ క్లాజ్ లేని ఖాతాల విషయంలో క్లెయిముల సెటిల్‌మెంట్‌కు సరళీకృత ప్రక్రియ అవలంబించాలని స్పష్టం చేసింది. నిర్దిష్ట పరిమితికే ఇది వర్తిస్తుందని వివరించింది. ఖాతాలో సహకార బ్యాంకులకు రూ.5 లక్షలు, ఇతర బ్యాంకులకు రూ.15 లక్షలుగా ఈ పరిమితి ఉంది. ఈ పరిమితికి మించి మొత్తం ఉంటే వారసత్వ ధ్రువీకరణ పత్రం లేదా చట్టబద్ధ వారసత్వ ధ్రువపత్రం వంటి అదనపు పత్రాలను కోరవచ్చని తెలిపింది.

ఆలస్యమైతే ఇదీ పరిహారం: 15 క్యాలెండర్ దినాల్లో క్లెయిమ్ సెటిల్‌మెంట్ చేయకపోతే.. బ్యాంకు ఖాతా విషయంలో 4% వడ్డీ రేటుకు తక్కువ కాకుండా పరిహారం ఇవ్వాల్సి ఉంటుంది. సేఫ్ డిపాజిట్ లాకర్/కస్టడీలోని వస్తువుల విషయంలో.. ఆలస్యమైన ప్రతి రోజుకూ రూ.5000 చొప్పున చెల్లించాలి.

# తగ్గిన ధరలు: కొత్త రేట్లు ప్రకటించిన టీవీఎస్

టీవీఎస్ మోటార్ కంపెనీ.. భారత మార్కెట్లో విక్రయించే తమ కమ్యూటర్ మోటార్ సైకిళ్లు & స్కూటర్ల కొత్త ధరలను ప్రకటించింది. జీఎస్టీ సవరణల తర్వాత సంస్థ ఈ ప్రకటన వెల్లడించింది. పండుగ సీజన్ సమయంలో టూ వీలర్ ధరలు తగ్గడం అనేది.. కొత్త వెహికల్స్ కొనేవారికి ఓ మంచి శుభవార్త.

**కొత్త ధరలు**

**టీవీఎస్ జూపిటర్ 110:** రూ. 72,400 (రూ. 6,481 తగ్గింది)

**టీవీఎస్ జూపిటర్ 125:** రూ. 75,600 (రూ. 6,795 తగ్గింది)

**టీవీఎస్ ఎన్‌టార్క్ 125:** రూ. 80,900 (రూ. 7,242 తగ్గింది)

**టీవీఎస్ ఎన్‌టార్క్ 150:** రూ. 1,09,400 (రూ. 9,600 తగ్గింది)

**టీవీఎస్ ఎక్స్ఎల్ 100:** రూ. 43,400 (రూ. 4,354 తగ్గింది)

**టీవీఎస్ రేడియన్:** రూ. 55,100 (రూ. 4,850 తగ్గింది)

**టీవీఎస్ స్పోర్ట్:** రూ. 55,100 (రూ. 4,850 తగ్గింది)

**టీవీఎస్ స్టార్ సిటీ:** రూ. 72,200 (రూ. 6,386 తగ్గింది)

**టీవీఎస్ రైడర్:** రూ. 80,900 (రూ. 6,725 తగ్గింది)

**టీవీఎస్ జెస్ట్:** రూ. 70,600 (రూ. 6,291 తగ్గింది)

ధరలు ఎంచుకునే వేరియంట్ను బట్టి మారుతాయి. కాబట్టి కచ్చితమైన ధరల కోసం కంపెనీ అధికారిక వెబ్‌సైట్ లేదా అధికృత డీలర్‌షిప్ సందర్శించి తెలుసుకోవచ్చు.

# పండుగ స్పెషల్..

## హోండా కొత్త ఎడిషన్ బైక్



హోండా మోటార్‌సైకిల్ & స్కూటర్ ఇండియా (HMSI) సరికొత్త సీబీ350సీ స్పెషల్ ఎడిషన్ లాంచ్ చేసింది. కంపెనీ లాంచ్ చేసిన ఈ బైక్ ధర రూ. 2.01 లక్షల (ఎక్స్‌షోరూమ్). దీని కోసం సంస్థ బుకింగ్స్ స్వీకరించడం ప్రారంభించింది. డెలివరీలు అక్టోబర్ 2025 మొదటి వారంలో ప్రారంభం కానున్నాయి.
హోండా సీబీ350సీ స్పెషల్ ఎడిషన్.. బిగ్‌వింగ్ డీలర్‌షిప్‌ల ద్వారా అందుబాటులో ఉంటాయి. ఇది స్టాండర్డ్ మోడల్ కంటే కొంత ఎక్కువ అప్డేట్స్ పొందింది. ఇంధన ట్యాంక్, ముందు, వెనుక ఫెండర్లలో గ్రాఫిక్స్ కనిపిస్తాయి. ఇది రెబెల్ రెడ్ మెటాలిక్ అండ్ మాట్ డ్యూన్ బ్రౌన్ అనే రెండు రంగు ఎంపికలలో లభిస్తుంది.
సీబీ350సీ స్పెషల్ ఎడిషన్ బైక్ 348.36 సీసీ సింగిల్‌సిలిండర్, ఎయిర్‌కూల్డ్ ఇంజిన్ పొందుతుంది. ఇది 5500 rpm వద్ద, 20 హార్స్ పవర్, 3000 rpm వద్ద 29.5 న్యూటన్ మీటర్ టార్క్ ప్రొడ్యూస్ చేస్తుంది. ఇది 5స్పీడ్ ట్రాన్స్‌మిషన్‌తో లభిస్తుంది. కాబట్టి పర్ఫామెన్స్ స్టాండర్డ్ మోడల్ మాదిరిగానే ఉంటుంది.

# తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన నగరాల్లో బంగారం, వెండి ధరలు ఇలా..



పెళ్లిళ్లు, శుభకార్యాలు అనగానే ముందుగా గుర్తొచ్చేది బంగారమే. అంతగా మన సంస్కృతి, సంప్రదాయాలతో ముడిపడిపోయింది ఈ లోహం. అంతేకాదు.. పెట్టుబడికి పెట్టాలనుకునే వారికి పసిడి మంచి సాధనం. పసిడితో పాటు వెండికీ మంచి గిరాకీనే ఉంది. అందుకే వీటి ధరలను ఎప్పటికప్పుడు తెలుసుకోవడం ఎంతో ముఖ్యం. మరి తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన నగరాలైన హైదరాబాద్, విజయవాడ, విశాఖ నగరాల్లో వాటి ధరలు (Gold Silver Rate Today) ఎలా ఉన్నాయో చూడండి..
బంగారం గురించి..
బంగారం స్వచ్ఛతను క్యారట్లల్లో కొలుస్తారు. క్యారట్ల వాల్యూ పెరిగే కొద్దీ బంగారం స్వచ్ఛత, ధర పెరుగుతాయి. మేలిమి బంగారాన్ని 24 క్యారట్లుగా (24 carat Gold ) చెబుతారు. అంటే ఇది 99.9 స్వచ్ఛమైన బంగారమన్నమాట. ఇది కాయిన్స్ (Gold Coins), బార్స్, బిస్కెట్ల రూపంలో మాత్రమే దొరుకుతుంది.
నగల తయారీకి 22 క్యారట్ల స్వచ్ఛతతో కూడిన బంగారాన్ని వినియోగిస్తారు. ఇందులో ఇతర లోహాలు కలుపుతారు. బంగారంతో చేయించుకునే ఆభరణాలన్నీ 22 క్యారెట్లు/916 స్వచ్ఛతతో ఉంటాయి. ఈ ధర కోసం మేలిమి బంగారం ధరను 91.6 శాతంతో గుణిస్తే సరిపోతుంది.
బంగారం, వెండి వంటి విలువైన లోహాల ధరలు అంతర్జాతీయ విపణికి అనుగుణంగానే ఉంటాయి. అక్కడ పెరిగితే ఇక్కడా పెరుగుతుంది. తగ్గినా అంతే. మన దేశం బంగారం కోసం దాదాపుగా దిగుమతులపైనే ఆధారపడినందున డాలర్ మారకపు విలువ కూడా దేశీయంగా పుత్తడి ధరలపై ప్రభావం చూపుతుంది.
కొన్ని దుకాణాలు, ప్రాంతాల్లో పన్నులు, సుంకాలు ముందుగా కలపకుండా లోహాల ధరలను ప్రకటిస్తుంటాయి. దీనివల్ల ధర తక్కువగా కనపడుతుంది. ఆభరణం నచ్చి, బిల్లు వేయమన్నప్పుడు, పన్నులు/సుంకాలు కలిపితే.. ఏ ప్రాంతంలో అయినా బంగారానికి ఒకటే ధర అవుతుంది. ఆభరణం తయారీ, తరుగు ఛార్జీల్లో మాత్రం ప్రతి దుకాణానికీ తేడా ఉంటుంది.
కొంతమంది వ్యాపారులు బిల్లు లేకుండా విక్రయిస్తాం.. అప్పుడు 3 శాతం జీఎస్టీ కట్టాల్సిన అవసరం ఉండదని చెబుతుంటారు. అయితే బిల్లు లేకుండా కొంటే కొన్ని చిక్కులు ఎదుర్కోవాలి. బంగారం నాణ్యత సరిగా లేకుంటే భారీగా నష్టపోవాల్సి వస్తుంది. ఆభరణం మరమ్మతులకూ బాధ్యత వహించరు. కాబట్టి బంగారం కొనేటప్పుడు బిల్లు ముఖ్యం.

# కొత్త కస్టమర్లను తీసుకోవద్దు: హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకుపై డీఎఫ్ఎస్ఏ ఆంక్షలు

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకుకు.. దుబాయ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ అథారిటీ (DFSA) షాకిచ్చింది. హెచ్‌డీఎఫ్‌సీ దుబాయ్ ఇంటర్నేషనల్ ఫైనాన్షియల్ సెంటర్ (DIFC) బ్రాంచ్.. కొత్త కస్టమర్లను చేర్చుకోవడపై నిషేధం విధించింది.
దుబాయ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ అథారిటీ ఆదేశాలు సెప్టెంబర్ 26 నుంచి అమలులోకి వచ్చాయి. తరువాత నోటీసులు అందేవరకు ఈ ఆర్డర్ అమలులోనే ఉంటుంది. కాబట్టి అప్పటివరకు కొత్త ఆర్థిక ఉత్పత్తులకు సంబంధించిన సలహాలు ఇవ్వడం, ఇన్వెస్ట్‌మెంట్ డీల్స్, క్రెడిట్ సంబంధిత సలహాలు ఇవ్వడం, కస్టడీ సర్వీస్ వంటి పలు ఆర్థిక సేవలను నిలిపివేయాలి. అంతే కాకుండా కొత్త ఆర్థిక ప్రచారాల్లో కూడా బ్యాంక్ పాల్గొనకూడదు. అయితే ఇప్పటికే ఉన్న బ్యాంక్ కస్టమర్లు.. తమ సేవలను యధావిధిగా పొందవచ్చు. దుబాయ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ అథారిటీ ఆదేశాలు పాటించడానికి బ్యాంక్ సిద్ధమైంది. అంతే కాకుండా ఈ సమస్యను వీలైనంత తొందరగా పరిష్కరించుకోవడానికి.. డీఎఫ్ఎస్ఏతో కలిసి పనిచేయడానికి తాము కట్టుబడి ఉన్నామని హెచ్‌డీఎఫ్‌సీ ఒక ప్రకటనలో వెల్లడించింది.
సెప్టెంబర్ 23 నాటికి, దాని డీఐఎఫ్సీ బ్రాంచ్‌లో జాయింట్ హోల్డర్లతో సహా 1,489 మంది కస్టమర్లు ఉన్నారని హెచ్‌డీఎఫ్‌సీ తెలిపింది. అయితే దుబాయ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ అథారిటీ ఇచ్చిన ఆర్డర్.. బ్యాంకు మొత్తం కార్యకలాపాలు లేదా ఆర్థిక స్థితిపై ఎటువంటి ప్రభావం చూపదని హెచ్‌డీఎఫ్‌సీ వెల్లడించింది. అంతే కాకుండా బ్రాంచ్ కస్టమర్ల నిరంతర సేవలకు ఈ నిషేధం వర్తించదని స్పష్టం చేసింది.



## బాలీవుడ్ ఎంట్రీ



‘హిట్ 2, గుంటూరు కారం, లక్కీ భాస్కర్, సంక్రాంతికి వస్తున్నాం’ వంటి చిత్రాలతో తెలుగు ప్రేక్షకులను అలరించి, స్టార్ హీరోయిన్‌గా రాణిస్తున్నారు మీనాక్షీ చౌదరి. ఈ బ్యూటీ బాలీవుడ్ ఎంట్రీ ఖరారైందని సమాచారం. జాన్ అబ్రహాం నటించనున్న హిందీ చిత్రం ‘ఫోర్స్ 3’లోని హీరోయిన్ పాత్ర కోసం మీనాక్షీ చౌదరిని ఎంపిక చేసిందట యూనిట్. భావ్ దులియా దర్శకత్వం వహించనున్న ఈ యాక్షన్ ఎంటర్‌టైనర్ చిత్రం షూటింగ్ ఈ నవంబరులో ప్రారంభం కానుంది.

ఈ సినిమాలో మీనాక్షి పాత్రకూ యాక్షన్ సన్నివేశాలు ఉంటాయని, ఇందుకోసం ఆమె శిక్షణ తీసుకోనున్నారని తెలిసింది. ఈ చిత్రానికి సంబంధించిన ప్రీ ప్రొడక్షన్ వర్క్స్ మొదలయ్యాయని, కొన్ని వర్క్‌షాప్స్ కూడా జరుగుతున్నాయని భోగట్టా. ఈ సినిమాను వచ్చే ఏడాది విడుదల చేయాలనుకుంటున్నారు.

# లా ఫర్మ్‌ల కతలు



**ఓటీటీలో ‘ఇది చూడొచ్చు’ అనేప్రాజెక్ట్స్ చాలా ఉంటాయి. ప్రస్తుతం స్ట్రీమ్ అవుతున్న వాటిలో ‘ది ట్రయల్’ రెండో సీజన్ ఒకటి. ఈ సిరీస్ గురించి తెలుసుకుందాం.**

ఏదైనా నేరం జరిగితే తగిన సాక్ష్యాలతో నేరస్థుడిని నిరూపించే ప్రక్రియలో న్యాయవాదులు ఉంటారు. ఆ న్యాయవాదుల సమూహంగా కొన్ని కంపెనీలు కూడా ఉంటాయి. ఆ కంపెనీలలో ఎంతో మంది న్యాయవాదులు తమ క్లయింట్ల తరఫున కోర్టులో విచారణకు హాజరవుతుంటారు. అటువంటి లా ఫర్మ్‌లపై తీసిన సిరీస్ ‘ది ట్రయల్’. 2023లో ఈ సిరీస్ మొదటి భాగం హాట్ స్టార్ వేదికగా రిలీజ్ అయింది. మళ్ళీ రెండేళ్ళకు దానికి కొన సాగింపుగా ఇప్పుడు 2025లో ‘ది ట్రయల్’ రెండో సీజన్ రిలీజ్ అయింది. కాజోల్ ప్రధాన పాత్రలో నటించగా ఆమె భర్త అజయ్ దేవగన్ ఈ సిరీస్‌కి నిర్మాతగా వ్యవహరించడం విశేషం. రెండు సిరీస్‌లు కలిపి 14 ఎపిసోడ్లతో ఉన్న ‘ది ట్రయల్’ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. ఈ సిరీస్ కథాంశానికొస్తే... న్యోనికాసేన్ గుతా ఓ పేరున్న ఫర్మ్‌లో మంచి లాయర్. ఆమె భర్త రాజకీయ నాయకుడు. ఆమె చేస్తున్న లా ఫర్మ్‌లో ఎన్నో రాజకీయాలతో ఆమె ప్రమోషన్‌ని అడ్డుకుంటూ న్యోనికా కుటుంబానికి కూడా ఆపద కలిగిస్తుంటారు ఆమె ప్రత్యర్థులు. ఆ లా ఫర్మ్‌లోకి వచ్చే కేసులు కూడా ఈ భార్యాభర్తలకు లింకు అవుతుంటాయి. ఆ లింకులు పెద్ద పెద్ద కష్టాలనే తెచ్చిపెడతాయి. మరి... ఆ కష్టాలన్నింటినీ తట్టుకుని తన క్లయింట్ల కేసులను వాదిస్తూ, ఫర్మ్‌లోని రాజకీయాలను ఎదుర్కొంటూ న్యోనికా నిజంగా ట్రయల్ గెలుస్తుందా? లేదా అన్నది మాత్రం సిరీస్‌లోనే చూడాలి. హాట్ స్టార్ వేదికగా స్ట్రీమ్ అవుతున్న ‘ది ట్రయల్’ మంచి కాలక్షేపం. ఈ లా ఫర్మ్ కతలు పెద్దలు మాత్రమే చూడదగినవి. ఎంజాయ్.

## కట్టప్ప కథ ఏంటి?



‘బాహుబలి’లో కట్టప్పగా సత్యరాజ్

బ్లాక్‌బస్టర్ మూవీ ‘బాహుబలి’లో కట్టప్ప పాత్ర ఓ మేజర్ హైలైట్. ఈ పాత్రనే ప్రధాన కథాంశంగా‘బాహుబలి’ రచయిత విజయేంద్రప్రసాద్ ఓ కథను రెడీ చేస్తున్నారట. ఈ కథతో ఓ సినిమా తీసేందుకే ఆయన కట్టప్ప పాత్ర ఆధారంగా స్క్రిప్ట్‌ను రెడీ చేస్తున్నారని, స్క్రిప్ట్ వర్క్ పూర్తయిన తర్వాత ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించే అవకాశం ఉందని సమాచారం. మాహిష్మతి రాజ్యంలో కట్టప్ప ఎందుకు కట్టుబానిసలా ఉన్నాడు? కట్టప్ప గతం, కట్టప్ప పూర్వీకుల నేపథ్యం వంటి అంశాలు ఈ సినిమాలో ఉంటాయట.

మరి... ‘బాహుబలి’ సినిమాలో కట్టప్ప పాత్రను పోషించిన సత్యరాజ్ ‘కట్టప్ప’ సినిమాలోనూ హీరోగా నటిస్తారా? లేక మరొకరు నటిస్తారా? ఎవరు దర్శకత్వం వహిస్తారు? అనే అంశాలపై స్పష్టత రావడానికి కొంత టైమ్ పడుతుంది. ప్రభాస్ హీరోగా, రానా, అనుష్క, తమన్నా, రమ్యకృష్ణ, సత్యరాజ్ కీలక పాత్రల్లో రాజమౌళి దర్శకత్వంలో రూపొందిన సినిమా ‘బాహుబలి’. రెండు భాగాలుగా విడుదలైన ఈ సినిమా బ్లాక్‌బస్టర్ విజయాలను సాధించింది. అలాగే ఈ రెండు భాగాలను కలిపి ‘బాహుబలి ది ఎపిక్’గా ఈ అక్టోబరు 31న విడుదల చేయనున్నారు.

## అనసూయ ‘3.ఓ’..

### స్విమ్ సూట్ ఫోటోలు వైరల్



యాంకర్ అనసూయకు సోషల్ మీడియాలో ఎంత ఫాలోయింగ్ ఉందో అందరికి తెలిసిందే. సినిమాల్లో కాకున్నా, సోషల్ మీడియాలో గ్లామరస్ పోస్టులు, వీడియోల ద్వారా మెరిపిస్తూ ఉంటుంది. తన దుస్తులు, వస్త్రధారణ విషయంలో వచ్చే విమర్శలకు ఘాటుగా బదులిస్తూ నిత్యం వార్తల్లో నిలుస్తుంటుంది.

అయితే తనపై ఎన్ని విమర్శలు వచ్చినా సరే.. తన ఎలా జీవించాలనుకుంటున్నానో.. అలాగే జీవిస్తుంది. తన డ్రెస్సింగ్ కామెంట్స్ చేస్తే అస్సలు పట్టించుకోదు. ఇంకా చెప్పాలంటే.. గతం కంటే మరింత గ్లామర్‌గా రెడీ అయి ఫోటో షూట్ చేస్తోంది.

తాజాగా అనసూయ తన ఇన్‌స్టాలో స్వీమ్ సూట్ ఫోటోలను షేర్ చేసింది. స్నేహితులతో కలిసి యూరప్ ట్రిప్ వేసిన అనసూయ.. ఐస్‌ల్యాండ్‌లో స్వీమ్ సూట్‌లో ఫోటోషూట్ చేసింది. బ్లాక్ స్విమ్ సూట్ ఫోటోలను ఇన్‌స్టాలో షేర్ చేయగా..అవి కాస్త వైరల్‌గా మారాయి. ‘న్యూ వెర్షన్.. 3.ఓ’, హాటీ అలర్ట్, వీకెండ్ బ్లాస్ట్’ అంటూ నెటిజన్స్ కామెంట్ చేస్తున్నారు. కాగా, గతంలో కూడా అనసూయ బికినీ, స్వీమ్ షూట్ ఫోటోలను షేర్ చేసింది.ఇక తన డ్రెస్సింగ్‌పై కామెంట్ చేస్తున్నవారిపై గతంలో అనసూయ తీవ్రంగా మండిపడ్డారు. ‘నా భర్త, పిల్లలను నన్ను ప్రేమిస్తున్నారు. నేను ఏం చేసినా సపోర్ట్ చేస్తారు. వారెప్పుడు నన్ను జడ్జ్ చేయలేదు. బోల్డ్‌గా ఉండటమంటే అగౌరవంగా ప్రవర్తిస్తున్నట్టు కాదు. నేను ఇష్టపడే విధంగా దుస్తులు ధరిస్తున్నానంటే నేను నా విలువలను కోల్పోయానని కాదు. నన్ను ఆదర్శంగా తీసుకోమని ఎవరికి చెప్పడం లేదు. నాకు నచ్చినట్లుగా నేను బతుకున్నాను. మీకు నచ్చినట్లుగా మీరు బతకండి’ అని అన్నారు.

## ఎర్ర గులాబీలా...

చ్చని చెట్ల మధ్య ఎర్రని గులాబీలా ఎరుపు రంగు డ్రెస్‌లో మెరిసిపోయారు అనుపమా పరమేశ్వరన్. ప్రకృతి అందాలను ఆస్వాదిస్తూ మైమరచిపోయారీ బ్యూటీ. షూటింగ్స్‌కి కాస్త విరామం దొరకడంతో ‘పచ్చందనమే... పచ్చదనమే’ అంటూ ఇలా సేద తీరారు. ఈ ఫొటోలను సోషల్ మీడియా వేదికగా షేర్ చేశారు. అనుపమ షేర్ చేసిన ఈ ఫొటోలు వైరల్‌గా మారాయి. అభిమాన తార ఇలా కలర్‌ఫుల్‌గా కనిపించడంతో ఆమె అభిమానులు ‘బ్యూటిఫుల్’ అని కితాబులిచ్చేశారు.

ఇక సినిమాల విషయానికొస్తే... అనుపమ నటించిన లేడీ ఓరియంటెడ్ మూవీ ‘పరదా’, బెల్లంకొండ సాయి శ్రీనివాస్ సరసన నటించిన ‘కిష్కింధపురి’ చిత్రాలు ఇటీవలే విడుదలయ్యాయి. ప్రస్తుతం ఆమె తమిళ చిత్రం ‘బైసన్’లో నటిస్తున్నారు. ఈ చిత్రంలో ప్రముఖ నటుడు విక్రమ్ తనయుడు ధృవ్ విక్రమ్ హీరోగా నటిస్తున్నారు.









# ఇంత చెత్తగా బౌలింగ్ చేస్తారా?.. హర్షిత్ రాణాపై అశ్విన్ ఫైర్




టీమిండియా యువ బౌలర్ హర్షిత్ రాణా ఆట తీరును భారత దిగ్గజ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ (R Ashwin) విమర్శించాడు. శ్రీలంకతో మ్యాచ్‌లో అతడి టెక్నిక్ సరిగ్గా లేదని.. తప్పులు సరిచేసుకోవాలని సూచించాడు. తన బౌలింగ్‌లో ప్రత్యర్థులు చితక్కొడుతున్నా మూస పద్ధతిలో వెళ్లడం సరికాదంటూ మండిపడ్డాడు.

ఆసియా కప్-2025 టోర్నమెంట్ ఆడే భారత జట్టులో పేస్ బౌలర్ల కోటాలో.. జస్‌ప్రీత్ బుమ్రా, అర్ష్‌దీప్ సింగ్ (Arshdeep Singh)తో పాటు హర్షిత్ రాణా స్థానం దక్కించుకున్నాడు. అయితే, ఈ టీ20 టోర్నీలో ఇప్పటికి టీమిండియా ఆడిన ఆరు మ్యాచ్‌లలో.. అతడికి కేవలం రెండు మాత్రమే ఆడే అవకాశం వచ్చింది.

### 26 పరుగులు

తొలుత లీగ్ దశలో భాగంగా ఆఖరిగా ఒమన్‌తో జరిగిన నామమాత్రపు మ్యాచ్‌లో హర్షిత్‌కు తుదిజట్టులో చోటు దక్కింది. ఈ మ్యాచ్‌లో 13 పరుగులతో అజేయంగా నిలిచిన హర్షిత్.. బౌలింగ్ పరంగానూ ఫర్వాలేదనిపించాడు. నాలుగు ఓవర్ల కోటాలో 26 పరుగులు ఇచ్చి ఒక వికెట్ తీశాడు.

### ఎక్స్‌పెన్సివ్ బౌలింగ్

అయితే, తాజాగా.. శుక్రవారం రాత్రి శ్రీలంకతో జరిగిన సూపర్-4 మ్యాచ్‌లో మాత్రం హర్షిత్ తేలిపోయాడు. అతడి బౌలింగ్‌లో లంక ఓపెనర్ పాతుమ్ నిసాంక చితక్కొట్టాడు. ఇక ఈ మ్యాచ్‌లో నాలుగు ఓవర్ల కోటా పూర్తి చేసిన ఈ రైటార్మ్ పేసర్ ఏకంగా 54 పరుగులు సమర్పించుకుని ఒకే ఒక్క వికెట్ తీశాడు.ఈ నేపథ్యంలో రవిచంద్రన్ అశ్విన్ స్పందిస్తూ.. "హర్షిత్ రాణా గురించి మాట్లాడాలని అనుకుంటున్నా. అవును.. అతడికి కొన్ని మ్యాచ్‌లు మాత్రమే ఆడే అవకాశం వచ్చింది. వేరే వారి కోసం అతడు బెంచ్‌కే పరిమితం కావాల్సి వస్తోంది.

### ఇంత చెత్తగా బౌలింగ్ చేస్తారా?

ఇలా జట్టులోకి వస్తూ పోతూ ఉండటం వల్ల ఆత్మవిశ్వాసం దెబ్బ తింటుంది. లయ కూడా మారుతుంది. అయితే, ఈ మ్యాచ్‌లో.. ఒకటి వేగంగా.. మరొకటి నెమ్మదిగా.. ఇంకోటి వేగంగా.. మరొకటి నెమ్మదిగా.. ఇలా పరిణతి లేకుండా సాగిపోయింది అతడి బౌలింగ్.

ఈ తప్పుల నుంచి అతడు కచ్చితంగా పాఠాలు నేర్చుకోవాల్సి ఉంటుంది" అని అశూ సుతిమెత్తగానే చురకలు అంటించాడు. ధారాళంగా పరుగులు సమర్పించుకోవడం వల్ల ఆత్మవిశ్వాసం మరింతగా దెబ్బతినే అవకాశం ఉందని హెచ్చరించాడు.

కాగా శ్రీలంకతో నామమాత్రపు సూపర్-4 మ్యాచ్ టై కాగా.. సూపర్ ఓవర్లో గెలిచిన టీమిండియా అజేయంగా ఫైనల్‌లో ఆడనుంది. దుబాయ్‌లో దాయాది పాకిస్తాన్‌తో టీమిండియా టైటిల్ కోసం ఆదివారం తలపడుతుంది.

# బౌలింగ్ కోచ్‌గా

## భారత మాజీ క్రికెటర్ నియామకం

భారత క్రికెట్ నియంత్రణ మండలి శనివారం కీలక నియామకం చేపట్టింది. బెంగళూరులోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ లో బౌలింగ్ కోచ్‌గా టీమిండియా మాజీ క్రికెటర్ సునిల్ జోషి ని నియమించింది. సాయి రాజ్ బహుతులే స్థానంలో అతడు ఈ మేరకు బాధ్యతలు చేపట్టనున్నాడు.ఆటకు స్వస్తి చెప్పిన తర్వాతకాగా కర్ణాటకకు చెందిన సునిల్ జోషి స్పిన్ ఆల్‌రౌండర్. టీమిండియా తరఫున 15 టెస్టుల్లో 41 వికెట్లు తీయడంతో పాటు.. 352 పరుగులు చేశాడు. అదే విధంగా.. 69 వన్డేల్లో 69 వికెట్లు తీసి 584 పరుగులు సాధించాడు. ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో 5129 పరుగులు కూడా సునిల్ జోషి ఖాతాలో ఉన్నాయి.

ఆటకు స్వస్తి చెప్పిన తర్వాత కోచ్ అవతారమెత్తిన సునిల్ జోషి దేశీ క్రికెట్‌లో అస్సాం, జమ్మూ కశ్మీర్, హైదరాబాద్ జట్లకు మార్గనిర్దేశనం చేశాడు. అంతర్జాతీయ స్థాయిలో బంగ్లాదేశ్, అమెరికా, ఒమన్ జట్లకు కోచ్‌గా సేవలు అందించాడు.

ఇక ఐపీఎల్‌లో 2023 నుంచి 2025 వరకు పంజాబ్ కింగ్స్ జట్టుకు స్పిన్ బౌలింగ్ కోచ్‌గానూ సునిల్ జోషి పనిచేశాడు. తాజా నియామకంతో పంజాబ్ ఫ్రాంఛైజీతో అతడికి ఉన్న అనుబంధం తెగిపోయినట్లయింది. వచ్చే సీజన్‌లో పంజాబ్ వేరే కోచ్‌ను వెతుక్కోవాల్సి ఉంటుంది.

కాగా వెస్టిండీస్‌తో టెస్టు సిరీస్‌కు ముందు భారత్-'ఎ' జట్టు ఆస్ట్రేలియా- 'ఎ' జట్టుతో రెండు మ్యాచ్‌ల అనధికారిక టెస్టు సిరీస్ ఆడిన విషయం తెలిసిందే. ఆ సమయంలో సునిల్ జోషి భారత జట్టుతోనే ఉన్నాడు.

### ఆణిముత్యాలను వెలికి తీసేందుకు

భారత పురుషుల, మహిళల క్రికెట్‌లోని అన్ని ఏజ్ గ్రూపుల ఆటగాళ్లను మెరికల్లా తీర్చిదిద్దే ఉద్దేశంతో బీసీసీఐ.. సునిల్ జోషిని రంగంలోకి దించింది. రాకేశ్ ధ్రువ్, నూషిన్ అల్ ఖదీర్ వంటి వారి పేర్లు పరిశీలనలోకి వచ్చినా.. సునిల్‌కే ఓటు వేసింది.

ఇక హెడ్, సహచర మాజీ ఆటగాడు వీవీఎస్ లక్ష్మణ్‌తో కలిసి సునిల్ పనిచేయనున్నాడు. యువ, వర్ధమాన స్పిన్నర్లకు శిక్షణ ఇవ్వనున్నాడు. అంతేకాదు.. టీమిండియా జట్టులో భాగమైన ఆటగాళ్లకు కూడా అవసరమైన సమయంలో CoEలో మెళకువలు నేర్పించేందుకు సిద్ధమయ్యాడు.

కాగా టీమిండియా ప్రస్తుతం ఆసియా టీ20 కప్-2025 టోర్నీతో బిజీగా ఉంది. దుబాయ్‌లో ఆదివారం జరిగే ఫైనల్లో పాకిస్తాన్‌తో తలపడనుంది. అనంతరం స్వదేశంలో అక్టోబరు 2 నుంచి వెస్టిండీస్‌తో రెండు మ్యాచ్‌ల టెస్టు సిరీస్ మొదలుపెట్టనుంది. ఈ నేపథ్యంలో అక్టోబరు 1న సునిల్ జోషి తన బాధ్యతలు చేపట్టనుండటం గమనార్హం.




# మనకు ప్రశ్న.. మన్నల్లో!




"వన్డే ప్రపంచకప్‌లో సొంతగడ్డపై జట్టును నడిపించడం చాలా ప్రత్యేకం. మాపై అభిమానులకు ఎన్నో అంచనాలు ఉంటాయి. అలా అని ఒత్తిడి పెంచుకోకుండా ఆటను ఆస్వాదించడం ముఖ్యం"
హర్మన్‌ప్రీత్ కౌర్, భారత్ కెప్టెన్

"వన్డే ప్రపంచకప్‌లో పోటీ కఠినంగా ఉంటుంది. ఉత్తమ జట్లతో తలపడేందుకు సిద్ధంగా ఉన్నాం. భారత్‌ను వారి పరిస్థితుల్లో ఓడించడం చాలా కష్టం. ఒత్తిడికి నిలవడం, కీలక సమయాల్లో రాణించడం ముఖ్యం"
అలీసా హీలీ ఆస్ట్రేలియా కెప్టెన్

భారత పురుషుల జట్టు ఖాతాలో రెండు వన్డే ప్రపంచకప్‌లు, రెండు టీ20 ప్రపంచకప్‌లు ఉన్నాయి. కానీ మహిళల జట్టు మాత్రం ఇప్పటిదాకా ఏ ఫార్మాట్లోనూ కప్పు కలను నెరవేర్చుకోలేకపోయింది. గతంలో వన్డే ప్రపంచకప్‌లో రెండు పర్యాయాలు ఫైనల్ చేరినా ట్రోఫీ మాత్రం దక్కలేదు. ఈసారి సొంతగడ్డపై జరగనున్న ఈ మెగా టోర్నీలో కప్పును వదలకూడదని పట్టుదలతో ఉంది భారత్. కానీ అది జరగాలంటే ఏదో ఒక దశలో కంగారూల గండాన్ని దాటాలి. మహిళల క్రికెట్ ఆరంభం నుంచి తిరుగులేని ఆధిపత్యం చలాయిస్తున్న ఆస్ట్రేలియా మరోసారి ఫేవరెట్‌గా బరిలోకి దిగుతోంది. ఆ జట్టును దాటి కప్పును చేరుకోవడం హర్మన్‌ప్రీత్ సేనకు అంత తేలిక కాదు.ఇప్పటిదాకా ఆస్ట్రేలియా మహిళల జట్టు ఆడిన వన్డేలు 381. అందులో ఆ జట్టు ఓడిన మ్యాచ్‌లు 68 మాత్రమే. 304 విజయాలు నమోదు చేసింది. మరే మహిళల జట్టూ 300 వన్డే విజయాలు సాధించింది లేదు. ఇక వన్డే ఫార్మాట్లో 12 ప్రపంచకప్‌లు జరిగితే అందులో ఏకంగా ఏడు ఆస్ట్రేలియా సొంతమయ్యాయి. మహిళల క్రికెట్లో ఆస్ట్రేలియా ఆధిపత్యం గురించి చెప్పడానికి ఇంతకంటే రుజువులేం కావాలి? ఎప్పట్లాగే ఈసారీ కంగారూ జట్టు ఫేవరెట్‌గా బరిలోకి దిగుతోంది. ఆ జట్టుకు స్వదేశం, విదేశం అని తేడా ఉండదు. ఎక్కడైనా ప్రత్యర్థి జట్లకు వణుకు పుట్టిస్తూనే ఉంటుంది. కాబట్టే ఈసారి ప్రపంచకప్ జరుగుతోంది భారత్‌లో అయినా.. కంగారూల అవకాశాలను ఎవ్వరూ కొట్టిపారేయడం లేదు. ప్రస్తుతం భారత జట్టు ఫామ్ కూడా బాగుంది కాబట్టి.. కప్పు మీద ఎక్కువ ఆశలే ఉన్నాయి. కానీ భారత్ ఎంత బాగున్నా.. కంగారూల సవాల్‌ను కాచుకుని నిలవడం మీదే కప్పు సొంతమవుతుందా లేదా అన్నది ఆధారపడి ఉంది.ఎటు చూసినా..: ఆస్ట్రేలియా క్రికెట్‌కు సంబంధించి అటు పురుషుల్లో అయినా, ఇటు మహిళల్లో అయినా వారి ప్రత్యేకతను చాటేది ప్రొఫెషనలిజమే. క్రికెట్ అంటే ఇలా ఆడాలి అనిపించేలా ఉంటుంది వారి ఆటతీరు. పురుషులతో పోలిస్తే మహిళల క్రికెట్లో వేగం ఉండదని, భారీ షాట్లు కొట్టలేరని, వేగంగా బంతులేయలేరని విమర్శించే వాళ్లు కూడా ఆస్ట్రేలియాను చూస్తే అభిప్రాయం మార్చుకుంటారు. పురుషుల క్రికెట్‌కు ఏమాత్రం తీసిపోని విధంగా దూకుడు ఉంటుంది వారి ఆటలో. కంగారూలకు, మిగతా జట్లకు మధ్య అంతరం స్పష్టంగా కనిపిస్తుంది. గత రెండేళ్లలో ఆ జట్టు 23 వన్డేలు ఆడితే.. అందులో ఓడింది మూడు మ్యాచ్‌లే. గత ఏడాది కాలంలో ఒక్క ఓటమే చవి చూసింది. ఆ ఓటమి ఇటీవల భారత జట్టు చేతిలో కావడం విశేషం. ఏకంగా 102 పరుగుల తేడాతో ఆస్ట్రేలియాను ఓడించి, ఈసారి కంగారూల సవాలును కాచుకోగలమని చాటింది హర్మన్‌ప్రీత్ సేన. కానీ ప్రపంచకప్‌లో ఆ జట్టు అంత తేలిగ్గా లొంగుతుందని అనుకోలేం. అన్ని రంగాల్లో ఆ జట్టుకు ప్రపంచ స్థాయి క్రికెటర్లు అందుబాటులో ఉన్నారు. ఆస్ట్రేలియా ఇప్పటిదాకా గెలిచిన 6 టీ20 ప్రపంచకప్‌ల్లోనూ భాగమైన ఆల్‌రౌండర్ ఎలీస్ పెర్రీ.. వన్డే ప్రపంచకప్‌లను రెండుసార్లు అందుకుంది. మహిళల క్రికెట్ చరిత్రలోనే ఆమెను మించిన ఆల్‌రౌండర్ లేరంటే అతిశయోక్తి కాదు. ఆష్లీ గార్డ్‌నర్, తాలియా మెక్‌గ్రాత్, అనాబెల్ సదర్లాండ్‌ల రూపంలో మరి కొందరు ఆల్‌రౌండర్లు ఆ జట్టుకు అందుబాటులో ఉన్నారు. వీళ్లందరూ బ్యాటుతో, బంతితో ఇక బ్యాటర్లలో కెప్టెన్ అలీసా హీలీ, బెత్ మూనీ, లిచ్‌ఫీల్డ్, జార్జియా వోల్.. వీళ్లంతా దూకుడుగా ఆడుతూ పెద్ద ఇన్నింగ్స్‌లతో జట్టును గెలిపించగలవాళ్లే. బౌలింగ్‌లో కూడా ఆసీస్‌కు తిరుగులేదు. మెగాన్ షట్, కిమ్ గార్త్, డార్సీ బ్రౌన్‌లతో పేస్ విభాగం.. అలానా కింగ్, జార్జియా వేర్‌హామ్‌లతో స్పిన్ దళం బలంగా కనిపిస్తోంది. అన్ని విభాగాల్లోనూ ఒకరిద్దరు విఫలమైనా వేరే వాళ్లు అందుకునేలా బలమైన ప్లేయర్లు ఆసీస్‌కు అందుబాటులో ఉన్నారు. ఆ జట్టు సమష్టిగా విఫలమైన రోజే ప్రత్యర్థులకు అవకాశముంటుంది. టోర్నీలో ఏ దశలో అయినా కంగారూలను ఓడించాలంటే అద్భుత ప్రదర్శన అవసరం. హర్మన్‌ప్రీత్ సేన మిగతా అడ్డంకులను దాటినప్పటికీ.. ఆసీస్‌తో ఎలా ఆడుతుందన్న దాన్ని బట్టే కప్పు గెలవడమా లేదా అన్నది ఆధారపడి ఉంటుందనడంలో సందేహం లేదు.

# టాప్5పై భారత్ గురి




దిల్లీ: ప్రపంచ పారా అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో టాప్5పై ఆతిథ్య భారత్ గురిపెట్టింది. ఈ మెగా టోర్నీలో పోటీలకు శనివారం తెరలేవనుంది. అక్టోబరు 5 వరకు జరిగే ఈ క్రీడా సంబరంలో 104 దేశాలకు చెందిన 1500 మందికి పైగా అథ్లెట్లు 186 పతక ఈవెంట్లలో తమ అదృష్టం పరీక్షించుకోనున్నారు. పురుషుల విభాగంలో 101, మహిళల్లో 84 ఈవెంట్లు.. ఒక మిక్స్‌డ్ కేటగిరీలో క్రీడాకారులు బరిలో దిగనున్నారు. గతంలో లండన్ (2017), దుబాయ్ (2019), పారిస్ (2023), కోబె జపాన్ (2024) ప్రపంచ పారా అథ్లెటిక్స్‌కు వేదికగా నిలవగా.. భారత్ తొలిసారిగా ఆతిథ్యమిస్తుంది. 74 మంది క్రీడాకారులతో భారత్ బరిలో దిగనుంది. ఈనాడు సీఎస్ఆర్ కార్యక్రమం 'లక్ష్య' క్రీడాకారులు జీవాంజి దీప్తి (400 మీటర్లు టీ20), అకిర నందన్ (200 మీ, 400 మీ టీ38) పతకాలపై గురిపెట్టారు. రెండు సార్లు పారాలింపిక్ స్వర్ణ పతక విజేత, పురుషుల జావెలిన్ త్రో (ఎఫ్64)లో డిఫెండింగ్ ఛాంపియన్ సుమిత్ అంటిల్ భారత్ తరఫున ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాడు. టీ64 హైజంప్‌లో పారిస్ పారాలింపిక్ ఛాంపియన్ ప్రవీణ్ కుమార్ ప్రపంచ పోటీల్లో బంగారు పతకం సాధించాలని ఉవ్విళ్లూరుతున్నాడు. సచిన్ ఖిలారి (పురుషుల ఎఫ్46 షాట్‌పుట్), ఏక్తా భ్యాన్ (మహిళల ఎఫ్51 క్లబ్ త్రో), సిమ్రన్ శర్మ (మహిళల 200 మీ ఎఫ్12) పతకాలు సాధించే అవకాశముంది. ప్రపంచ అథ్లెటిక్స్‌లో చైనా తిరుగులేని ఆధిపత్యం కొనసాగుతోంది. గత నాలుగు టోర్నీల్లోనూ చైనా అగ్రస్థానంలో నిలిచింది. 2024లో 33 స్వర్ణాలు సహా 87 పతకాలు సొంతం చేసుకుంది. నిరుడు 6 స్వర్ణాలు, 5 రజతాలు, 6 కాంస్యాలు సహా 17 పతకాలు గెలిచిన భారత్.. పట్టికలో ఆరో స్థానం సాధించింది.

# ఎక్కడ తగ్గాలో కూడా అతడికి తెలుసు: జయసూర్య




భారత యువ ఆటగాడు అభిషేక్ శర్మపై శ్రీలంక కోచ్ జయసూర్య ప్రశంసలు కురిపించాడు. అతడి ఫియర్‌లెస్ బ్యాటింగ్‌ను కొనియాడాడు. అలాగే అతడు స్వేచ్ఛగా ఆడేందుకు అనుమతిస్తున్న టీమ్ మేనేజ్‌మెంట్‌ను ప్రశంసించాడు. అభిషేక్ శర్మ ప్రస్తుత ఆసియా కప్‌లో బ్యాట్‌తో చక్కగా రాణిస్తున్నాడు. వరుసగా మూడు హాఫ్‌సెంచరీలు సైతం నమోదు చేశాడు. 'అభిషేక్ శర్మ తన సహజసిద్ధమైన ఆటను ఆడుతున్నాడు. టీమ్‌మేనేజ్‌మెంట్ అతణ్ని ఎంతగానో ప్రోత్సహిస్తోంది. అతడికి ఇలా మద్దతు లభించడం ఎంతో కీలకం. కేవలం వేగంగా ఆడటమే కాదు. ఎక్కడ తగ్గాలో కూడా అతడికి తెలుసు. పవర్‌ప్లే తర్వాత అతడు కాస్త నెమ్మదిగా ఆడుతున్నాడు. దీంతో ఎక్కువ సమయం క్రీజులో ఉండగలుగుతున్నాడు. అతడు రోజు రోజుకూ ఎక్కువ పరుగులు చేస్తున్నాడు. బ్యాటింగ్‌లో మెరుగవుతున్నాడు' అని జయసూర్య అన్నాడు.

'అభిషేక్ శర్మ ఆడకపోతే గెలిచేస్తాం'.. అవి పాక్ మాజీల పగటి కలలే!

అలాగే టీమ్‌ఇండియా కోచింగ్ టీమ్ గురించి సైతం అతడు మాట్లాడాడు. 'కోచింగ్ స్టాఫ్.. అభిషేక్‌కు తన సహజసిద్ధమైన ఆట ఆడేందుకు లైసెన్స్ ఇచ్చారు. ఇది చాలా మంచి విషయం' అని జయసూర్య పేర్కొన్నాడు. అలాగే టీమ్‌ఇండియా, శ్రీలంక మధ్య మ్యాచ్‌లో జరిగిన సూపర్ ఓవర్ గురించి అతడు మాట్లాడాడు. 'మ్యాచ్‌లు సూపర్ ఓవర్ వరకు వెళ్లాలని కెప్టెన్, కోచ్.. ఎవరూ కోరుకోరు. 203 పరుగులను ఛేదించడం సాధారణ విషయం కాదు. మేం దాదాపు సాధించాం. మా బ్యాటింగ్ లైనప్ బాగుంది. కానీ దురదృష్టవశాత్తు మేం సూపర్ ఓవర్‌లో ఓడిపోయాం' అని జయసూర్య వాపోయాడు.

ఆసియా కప్ 2025లో అభిషేక్ శర్మ అద్భుతమైన ఫామ్‌లో ఉన్నాడు. ఇప్పటి వరకు జరిగిన ఆరు మ్యాచుల్లో అతడు 309 రన్స్‌తో.. అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్ల జాబితాలో తొలి స్థానంలో కొనసాగుతున్నాడు. ఫైనల్ మ్యాచ్‌లో టీమ్‌ఇండియా ఆదివారం దుబాయ్ ఇంటర్నేషనల్ స్టేడియం వేదికగా పాక్‌తో తలపడనుంది. ఈ మ్యాచ్‌లోనూ అభిషేక్ రాణించాలని టీమ్‌ఇండియా అభిమానులు కోరుకుంటున్నారు.

